
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY


భీమవరం **ఉష్ణోగ్రతలు**
గరిష్ఠం : 32.0 కనిష్ఠం : 26.0
తణుకు : 31.0 - 26.0

నరసాపురం టు మచిలీపట్నం
కొత్త రైల్వే లైన్ సర్వేకు పచ్చ జెండా



- బ్రిటీష్ కాలం నాటి ప్రతిపాదనలపై కదలిక
- కోటిపల్లి-నరసాపురం లైన్‌కు రూ.300 కోట్లు
- వేగవంతం కానున్న రైల్వే ట్రాక్ పనులు
- రైల్వే బడ్జెట్‌లో తీర ప్రాంతానికి వరం
- రూపురేఖలు మారనున్న నరసాపురం ముఖచిత్రం

నరసాపురం, జూలై 25 : సముద్ర తీరం వెంబడి కొత్త రైల్వే లైన్ ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వం పచ్చజెండా ఊపింది. బ్రిటీష్ హయాం నుంచి ప్రతిపాదనలకే పరిమితమైన నరసాపురం-మచిలీపట్నం మధ్య లైన్‌కు సర్వే చేయాలని నిర్ణయించింది. మంగళవారం సమర్పించిన 2024-25 కేంద్ర బడ్జెట్‌లో ఈ మేరకు ప్రతిపాదనలు చేసినట్లు రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ తెలిపారు. ఈ పనులు పూర్తయితే నరసాపురం పెద్ద జంక్షన్‌గా మారనుంది. చివరి స్టేషన్ అన్న పేరు నుంచి తప్పుకోనుంది. ఇప్పటికే నరసాపురం నుంచి భీమవరం మీదుగా నిడదవోలు, గుంటూరు, విజయవాడ, నాగర్‌సోల్, బెంగళూరు, హుబ్లీ, ధర్మవరం, లింగంపల్లి, హైదరాబాద్‌కు రాకపోకలు సాగిస్తున్నాయి. మరోవైపు కోటిపల్లి-నరసాపురం రైల్వే లైన్ పూర్తయితే నరసాపురం జంక్షన్ అవుతుంది. కేంద్ర ప్రభుత్వ నిర్ణయాన్ని పశ్చిమ గోదావరి, ఏలూరు, కృష్ణా జిల్లావాసులు స్వాగతిస్తున్నారు. మచిలీపట్నం-నరసాపురం మార్గాన్ని రైల్వే రూట్‌లో కలపాలని బ్రిటిష్ హయాంలోనే ప్రతిపాదించారు. దీనిని పట్టాలెక్కించేందుకు మోదీ సర్కార్ ఫైనల్ లొకేషన్ సర్వేకు ఆదేశించింది. 69 కిలోమీటర్ల మేర కొత్త లైన్‌కు పలుచోట్ల ఉప్పుటేర్లపై వంతెనలు వేయాల్సి ఉంది. ఈ కారణంగా భారీ వ్యయం అవుతుందని అప్పట్లో ఈ ప్రతిపాదనను పెండింగ్ పెట్టారు. ప్రస్తుతం రైలులో మచిలీపట్నం వెళ్లాలంటే గుడివాడ వెళ్లి అక్కడి నుంచి రైలు మారాలి. అదే నరసాపురం నుంచి మచిలీపట్నం పూర్తయితే మొగల్తూరు, బంటుమిల్లి మీదుగా వెళ్లవచ్చు. దీనివల్ల కోస్తా తీరం వెంబడి రైలు మార్గం ఏర్పడుతుంది. ఇప్పటికే కోటిపల్లి రైల్వేలైన్ వల్ల కాకినాడ నుంచి నరసాపురం వరకు రైలు మార్గం ఏర్పడింది. ఇటు మచిలీపట్నం పూర్తి చేస్తే సముద్ర తీరం వెంబడి రైలు కూత వినిపిస్తుంది. ప్రస్తుతం ఈ బడ్జెట్‌లో సర్వే పనులు చేపడుతున్నట్లు రైల్వే మంత్రి ప్రకటించారు. ఈ ప్రాజెక్టు పట్టాలెక్కితే నరసాపురం స్టేషన్ పెద్ద జంక్షన్‌గా మారడంతోపాటు చివరి స్టేషన్ అన్న మార్క్ నుంచి తొలగనుంది.

కోటిపల్లికి రూ.300 కోట్లు..

ఈ ఏడాది ఫిబ్రవరిలో ప్రకటించిన రైల్వే బడ్జెట్‌లో కోటిపల్లి రైల్వేలైన్‌కు రూ.300 కోట్లు కేటాయించారు. ఈ నిధులను పూర్తి స్థాయిలో వినియోగించి ప్రాజెక్టు పనులను వేగవంతం చేస్తామని కేంద్ర రైల్వే శాఖ మంత్రి ప్రకటించారు. ఇప్పటి వరకు ఈ ప్రాజెక్టుకు బడ్జెట్‌లో రూ.1,150 కోట్లు కేటాయించారు. ప్రస్తుతం రూ.300 కోట్లతో రూ.1,450 కోట్లకు చేరింది. ఈ నిధులకు రాష్ట్ర ప్రభుత్వం తన వాటాగా 25 శాతం చెల్లించాల్సి ఉంటుంది. ఇప్పటి వరకు రాష్ట్రం ఇచ్చిన వాట మొత్తం రూ.50 కోట్లు మాత్రమే అది కూడా 2019కి ముందు. గత ప్రభుత్వం ఒక్క రూపాయి కూడా ఈ ప్రాజెక్టుకు కేటాయించలేదు. ఈ కారణంగా పనులు ముందుకు సాగలేదు.

51 కిలోమీటర్ల మేర చేపట్టే ఈ కొత్త రైల్వేలైన్ వల్ల కోనసీమ జిల్లాలోని అమలాపురం, రాజోలుకు రైలు మార్గం ఏర్పడనుంది. దీంతోపాటు విశాఖ, రాజమండ్రి మధ్య మెయిన్‌లైన్‌లో ట్రాఫిక్ రద్దీని తగ్గించేందుకు ప్రత్యామ్నాయ మార్గం ఏర్పడనుంది. ఇప్పటికే ఈ ప్రాజెక్టులో మూడు భారీ వంతెనలు చివరి దశకు చేరుకున్నాయి. భూసేకరణ కూడా 75 శాతం పూర్తయింది. నిధులు పూర్తి స్థాయిలో ఉంటే ట్రాక్ పనులు వేగవంతం కానున్నాయి.







తగ్గి.. పెరుగుతోంది

గోదావరి వరద.. కొనసాగుతున్న రెండో ప్రమాద హెచ్చరిక

- జల దిగ్బంధంలోనే లంక గ్రామాలు.. అరటి, కూరగాయల తోటలు
- పశుగ్రాసం లేక మూగజీవాలు విలవిల
- ఐదో రోజు నిలిచిన పంటు ప్రయాణం


నరసాపురం : వశిష్ఠ ఉధృతి

పెనుగొండ/ఆచంట/యలమంచిలి/నరసాపురం, జూలై 25: ఎగువ ప్రాంతంలో గోదావరి తగ్గి మళ్లీ పెరుగుతోంది. దీనిపై జిల్లాలోని తీర ప్రాంత రైతులు ఆందోళన చెందుతున్నారు. దిగువ ప్రాంతాల్లో వరద తగ్గినప్పటికీ ఒడి మాత్రం తగ్గలేదు. పెనుగొండ మండలం సిద్ధాంతంలో గోదావరి నీటి మట్టం కొద్దిగా తగ్గినప్పటికీ ఉధృతి తగ్గలేదు. అరటి, కూరగాయల తోటలు నీట మునిగాయి. అరటికి పెద్దగా నష్టం లేకపోయినా, కూరగాయల పంటలు దెబ్బ తింటాయని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఆచంట మండలం అయోధ్యలంక, పెదమల్లలంక, కోడేరు లంక పల్లపు ప్రాంతాలు ఇంకా గోదావరి ముంపులోనే ఉన్నాయి. పెదమల్లం మాచేనమ్మ ఆలయం, కోడేరు వద్ద గోదావరి కాస్త తగ్గినప్పటికీ ప్రవాహం వేగం తగ్గలేదు. మరోవైపు లంక గ్రామాలు నీట మునగడంతో పశుగ్రాసానికి ఇబ్బంది ఏర్పడింది. పశువులకు పచ్చగడ్డి దొరక్క మూగజీవులు ఇబ్బందులు పడుతున్నాయి. యలమంచిలి మండలం లంకగ్రామాలైన కనకాయలంక, పెదలంక, లక్ష్మీపాలెం, యలమంచిలి లంక, బాడవ గ్రామాల్లో పల్లపు ప్రాంతాలు ఇంకా ముంపులోనే ఉన్నాయి. నాలుగు రోజులుగా కనకాయలంక కాజ్ వే వద్ద గ్రామస్తుల రాకపోకలు పడవల్లోనే సాగుతున్నాయి. దొడ్డిపట్ల, లక్ష్మీపాలెం గ్రామాల్లోని పల్లిపాలెం ప్రాంతాల్లో ఇళ్ల చుట్టూ చేరిన నీరు క్రమంగా తగ్గుతోంది. నరసాపురం వద్ద వశిష్ఠ గోదావరికి వరద పోటు తగ్గలేదు. ఎగువ నుంచి గురువారం లక్షలాది క్యూసెక్కుల వరద నీటిని విడుదల చేయడంతో ఆ ప్రభావం వశిష్ఠపై పడింది. దీంతో ఐదో రోజు ఉభయ గోదావరి జిల్లాల మధ్య రాకపోకలను రద్దు చేశారు. గత రెండు వరదలతో పోలిస్తే క్రమంగా తగ్గుముఖం పడుతున్నట్లు ఏటిగట్టులశాఖ ఏఈ సుబ్బారావు చెప్పారు. రేవుల్లో నీటిమట్టాలు తగ్గలేదు. ఎవరిని స్నానాలకు అనుమతించడం లేదు. వలంధర్, పిండాల రేవు, లలితాంబ రేవులు నీట మునిగాయి. కొత్త నవరసపురం ఎస్టీ కాలనీలోకి వరద నీరు చేరింది. భద్రాచలం వద్ద రెండో ప్రమాద హెచ్చరిక కొనసాగుతోంది.


పెనుగొండ : సిద్ధాంతంలో నీట మునిగిన అరటి తోట


యలమంచిలి : కనకాయలంక కాజ్ వే వద్ద స్థానికుల రాకపోకలు

తాడేపల్లిగూడెం రూరల్ : నందమూరులో వరదలకు కుళ్లిన వరిపొలాలు


నీరు లాగేదెప్పుడు ?

- పొంగిన నక్కల డ్రెయిన్‌తో స్తంభించిన మురుగు నీరు.. ముంపులోనే పొలాలు.. కుళ్లుతున్న నారుమళ్లు
- నారు దొరకాలి.. నీరు లాగాలి.. అప్పుడే నాట్లు వేసేది


యలమంచిలి : గుంపర్రులో మోకాలు లోతు నీళ్లలో రైతులు

ఆచంట/యలమంచిలి/పాలకోడేరు/తాడేపల్లిగూడెం రూరల్/గణపవరం/తణుకు, జూలై 25 : భారీ వర్షాలు, గోదావరి వరదలతో పంట పొలాలు నీట మునిగి వరి నాట్లు, నారుమడులు దెబ్బతిన్నాయి. రెండు రోజులుగా పలుచోట్ల పొలాల్లో నీరు నెమ్మదిగా లాగుతున్నప్పటికీ యలమంచిలి మండలం గుంపర్రు రెవెన్యూ గ్రామ పరిధిలోని వరి చేలు పది రోజులుగా ముంపులోనే ఉండటంతో నారుమళ్లు కుళ్లిపోయాయి. 800 ఎకరాలు నడుం లోతు నీళ్లలో ఉన్నాయి. ఈ ఆయకట్టులోని మురుగు నీరు నెంబర్ 1, 2 మైనర్ డ్రెయిన్ల ద్వారా వెళ్లి నక్కల డ్రెయిన్‌లో కలుస్తుంది. వరదల కారణంగా మైనర్ డ్రెయిన్‌లు, నక్కల డ్రెయిన్ పొంగి పొర్లడంతో చేలల్లో మురుగు నీరు స్తంభించింది. మళ్లీ నారుమడులు వేయాలన్నా.. నారు దొరికి నాట్లు వేయాలన్నా మురుగు నీరు బయటకు వెళ్లాల్సిందే. ఇది బయటకు వెళ్లేదెప్పుడు ? సార్వా సాగు చేపట్టేదెపుడో తెలియక రైతులు దిక్కుతోచని స్థితిలో వున్నారు. ముంపు తగ్గినా వరి నారు దొరికే పరిస్థితి లేదు. ఈ నేపథ్యంలో సార్వా సాగు సాగేనా అని అనుమానం వ్యక్తంచేస్తున్నారు. నెంబరు 2 మైనర్ డ్రెయిన్‌పై కొన్నేళ్ల క్రితం కల్వర్టు నిర్మించారని, దీనికి షట్టర్ ఏర్పాటు చేయకుండా అప్పట్లో పనులు నిలిచిపోవడంతో మురుగు సమస్య తీవ్ర తరమవుతుందని రైతులు జద్దు రామకృష్ణ, కొలకలూరి రామకృష్ణ చెబుతున్నారు. నెంబరు 2 మైనర్ డ్రెయిన్‌పై కల్వర్టు నిర్మించడానికి ప్రతిపాదనలు చేసినప్పటికీ నిర్మాణం జరగలేదు. కల్వర్టు నిర్మాణం, షట్టరు ఏర్పాటుచేస్తే మురుగు సమస్య ఇంత తీవ్రంగా ఉండదని రైతులు అభిప్రాయపడుతున్నారు. ఏటా సార్వా సాగులో వరి చేలు ముంపు బారిన పడి తీవ్రనష్టాల బారిన పడుతున్నామని ఆవేదన చెందుతున్నారు. నక్కల డ్రెయిన్, మైనర్ డ్రెయిన్‌ల ఆధునికీకరణ పనులు చేపట్టి సమస్యను శాశ్వతంగా పరిష్కారమయ్యేలా చర్యలు చేపట్టాలని రైతులు కోరుతున్నారు. ఆచంట మండలం ఆచంట వేమవరం, నక్కల కాలువను ఆనుకుని వున్న పంట పొలాలు గోదావరిని తలపిస్తున్నాయి. వేమవరం, పోడూరు మండలంలోని పలు గ్రామాలలో వెయ్యి ఎకరాలు మనిషి లోతు నీళ్ళల్లో ఉన్నాయి. నక్కల కాలువలో పేరుకుపోయిన గుర్రపు డెక్కను జేసీబీ సాయంతో తొలగిస్తున్నారు. పాలకోడేరు, గుత్తుల వారిపాలెం, మోగల్లు గ్రామాల్లోని కాల్వల్లో నీరు ఇంకా తగ్గకపోవడంతో పొలాలు చెరువులను తలపిస్తున్నాయి. పంట కాల్వలు, పంట బోదెలు, తగ్గితేనే పొలాల్లోని మురుగు బయటకు వెళ్లే దారి ఉంటుందని రైతులు చెబుతున్నారు.


తణుకు : తగ్గిన వయ్యేరు.. కనిపిస్తున్న ఇళ్లు

తగ్గుతున్న మునక.. పంట చేలు దుర్వాసన

ఎర్రకాలువ వరదల్లో వారానికి పైగా మునిగిన వరి పొలాలు ఇప్పుడిప్పుడే బయట పడుతున్నాయి. తాడేపల్లిగూడెం మండలం మాధవరం, జగన్నాధపురం, నందమూరు, ఆరుళ్ల, అప్పారావుపేట గ్రామాల్లో నీటిలో నానడం వల్ల వరి పనలు కుళ్లి దుర్వాసన వస్తోంది. మరోపక్క లోతట్టు ప్రాంతాల్లో నేటికి వరద నీరు వదలకపోవడంతో పంట చేల వద్ద విష సర్పాలు సంచరిస్తూ రైతులను భయభ్రాంతులకు గురిచేస్తున్నాయి. ఎర్ర కాలువ వరదలకు మండలంలోని తొమ్మిది గ్రామాల్లో పది వేల ఎకరాలు నష్ట పోయినట్టు ప్రాథమిక అంచనా. తుది అంచనాలపై అధికారులు దృష్టి పెట్టారు.

తగ్గిన వయ్యేరు ఉధృతి

దువ్వ వయ్యేరు అక్విడెక్టు వద్ద వరద ఉధృతి తగ్గుముఖం పట్టింది. అక్విడెక్టు వద్ద 18 అడుగుల నుంచి 12కు తగ్గింది. వయ్యేరు సమీపంలోని కాలనీలు సాధారణ స్థితికి చేరుకున్నాయి. పంట పొలాల్లోని వరద నీరు తగ్గుతోంది. కాలనీ వాసులకు భోజనాలు ఏర్పాటు చేసి, ఉచిత వైద్య శిబిరాలు కొనసాగిస్తున్నారు.

శాంతించిన యనమదుర్రు

యనమదుర్రు డ్రెయిన్ ఉధృతి తగ్గింది. గురువారం గణపవరం మండలం పిప్పర వద్ద నీటి మట్టం 12.1 అడుగులకు చేరింది. అయినప్పటికీ ఎస్.కొండేపాడు కాలనీ నీటి ముంపులోనే ఉంది. డ్రెయిన్ నీటిమట్టం మరింత తగ్గితే ముంపు బారి నుంచి బయట పడవచ్చని భావిస్తున్నారు. ఇదే పరిస్థితిలో పిప్పర, కొమ్మర్రు కాలనీలు నీటిలోనే ఉన్నాయి. నాలుగు వేల ఎకరాలు ముంపు నుంచి తేలుకోలేదు.

- రొయ్య జోరు.. రైతు హుషారు

ఆక్వాకు గుడ్ డేస్



పెరగనున్న సాగు విస్తీర్ణం

కేంద్ర బడ్జెట్‌లో ఎగుమతి, దిగుమతుల సుంకం తగ్గింపు

ఆక్వా రంగానికి పూర్వ వైభవం రానుంది. కేంద్రం ఇచ్చిన పన్ను రాయితీలతో రైతుల్లో జోష్ నెలకొంది. ఐదేళ్లపాటు పతనమైన ఆక్వా సాగుకు ఊతమిచ్చేలా కేంద్ర ప్రభుత్వం బడ్జెట్‌లో ప్రతిపాదనలు చేసింది. ఎగుమతి, దిగుమతి పన్నులను తగ్గించింది. పన్ను శాతం సగానికి తగ్గించడంతో ఎగుమతులకు అవకాశాలు మెరుగయ్యాయి. ఇతర దేశాలతో పోటీ పడి ఎగుమతులు సాధించేందుకు కేంద్రం చర్యలు దోహదపడుతున్నాయి.

(భీమవరం-ఆంధ్రజ్యోతి)

ఆక్వా ఎగుమతులపై గతంలో 30 శాతం సుంకం విధించారు. ఇప్పుడు కేంద్ర బడ్జెట్‌లో దానిని 15 శాతానికి తగ్గించారు. ఫలితంగా రొయ్య ఉత్పత్తులు ఎగుమతులు జోరందుకోనున్నాయి. రైతులకు మంచి ధర లభించనుంది. పన్ను తగ్గడం వల్ల వ్యాపారులు ఎగుమతులకు పోటీ పడనున్నారు. తద్వారా రొయ్య రైతుకు మంచి ధర లభించనుంది. ఇప్పటికే ధరలు పెరుగుతాయన్న అంచనాతో రైతులు వున్నారు. కేంద్ర నిర్ణయంపై ఆక్వా రైతు సంక్షేమ సంఘం హర్షం వెలిబుచ్చింది. రైతులు సాగు పెంచేందుకు ఉత్సాహం చూపుతున్నారు. ఐదేళ్లపాటు ఆక్వా రంగం సంక్షోభంలో కూరుకుపోయింది. ప్రభుత్వస్థాయిలో సరైన విధాన నిర్ణయం తీసుకోలేకపోయారు. ఎగుమతులు మందగించాయి. ధరలు పతనమయ్యాయి. పెట్టుబడి వ్యయం పెరిగింది. విద్యుత్ కనెక్షన్‌లు, ట్రాన్స్ ఫార్మర్ ఛార్జీలను అమాంతం పెంచేశారు. నాన్ ఆక్వా జోన్‌లో విద్యుత్ రాయితీని ఎత్తివేశారు. ఆక్వా జోన్‌లోనూ బొగ్గు ధరల పెరుగుదల, విద్యుత్ కొనుగోలు వ్యయం పెరుగుదల, ట్రూ అప్ ఛార్జీలంటూ యూనిట్‌కు రూ.10పైనే వసూలు చేశారు. పేరుకే యూనిట్ విద్యుత్ రూ.1.50కు అంటూ గత ప్రభుత్వం ఊదరగొట్టింది. ఇతర ఛార్జీలను వడ్డించింది. రొయ్య పిల్ల నుంచి మేత వరకు ధరలు ఆకాశాన్ని తాకాయి. దిగుమతులకు అవకాశం లేదు. దిగుమతి పన్ను 15 శాతం శాతం ఉండేది. ఇప్పుడు దానిని ఐదు శాతానికి కుదించారు. అంటే మేత ధరలు తగ్గుముఖం పట్ట నున్నాయి. రొయ్య రైతుకు ఇది ఎంతో ప్రయోజనం చేకూర్చనుంది. మేత ధరలు అందుబాటులోకి రానున్నాయి. గతంలో రొయ్య రైతు మేత కోసం రూ.90 వేల వరకు పెట్టుబడి చేయాల్సి వచ్చేది. ఇతర దేశాల నుంచి ఇప్పుడు దిగుమతికి అవకాశం ఉంటుంది. తద్వారా రొయ్య మేత రూ.70 వేలకు లభ్యం కానుందన్న అంచనాతో రైతులు వున్నారు. మరోవైపు తల్లి రొయ్య దిగుమతిపైనా సుంకాన్ని తగ్గించారు. దీనివల్ల పిల్ల ధరలు అందుబాటులోకి రానున్నాయి.

జోన్‌లో సంబంధం లేని విద్యుత్ రాయితీ

వైసీపీ ప్రభుత్వంలో యూనిట్ విద్యుత్‌ను రూ.1.50లకు అమలు చేసినా సరే జోన్‌కు పరిమితం చేశారు. కూటమి అధికారంలోకి వస్తే జోన్‌తో నిమిత్తం లేకుండా అందరికీ రూ.1.50కే అందిస్తామని ప్రకటించారు. అది కూడా ట్రూ అప్ ఛార్జీలను తగ్గించాలి. ఆ దిశగా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటే కేంద్రం ఇచ్చిన రాయితీలతో రొయ్య సాగులో పెట్టుబడి వ్యయం తగ్గనుంది. పెట్టుబడి వ్యయం పెరగడంతో ఐదేళ్లుగా రైతులు సాగు నుంచి తప్పుకొంటూ వచ్చారు. పశ్చిమ గోదావరి జిల్లాలో దాదాపు 1.05 లక్షల ఎకరాల్లో రొయ్య సాగు ఉండేది. ఇప్పుడు 50 వేలకు పడిపోయింది. లీజు ధరలు పతనమయ్యాయి. ఆ ప్రభావం జిల్లా ఆర్థిక వ్యవ స్థపై తీవ్రంగా పడింది. ఇతర వ్యాపారాలు మందగించాయి. భీమవరంలో వ్యాపారాలు వెలవెలబోయాయి.

ధర పెరుగుదల

రొయ్య ధరలు పెరగనున్నాయి. విదేశీ మారక ద్రవ్యం అధికం కానుంది. ఎగుమతి సుంకం తగ్గించడంతో వ్యాపారులు రొయ్యకు అధిక ధర ఇచ్చి కొనుగోలు చేయనున్నారు. జిల్లాలో దాదాపు 12 మంది ప్రముఖ వ్యాపారులున్నారు. విదేశీ వ్యాపారులతో పోటీ పడలేక నష్టాలను చవిచూశారు. ఎగుమతి సుంకంతో రొయ్య వాణిజ్యం దెబ్బతింది. ఫలితంగా ఇక్కడ ధరలు తగ్గించారు. రైతులకు సరైన ధరలు ఇవ్వలేదు. ప్రభుత్వం 100 కౌంట్ ధర రూ.240 అంటూ ప్రకటించింది. అయినా వ్యాపారులు అంత మొత్తంలో కొనుగోలు చేయలేదు. ఒక దశలో రూ.190లకు ధర పడిపోయింది. రైతులు పీకల్లోతు అప్పుల్లో కూరుకుపోయారు. కనీసం పెట్టుబడి కూడా రాని పరిస్థితి. కేంద్ర ప్రభుత్వం రెండు రోజుల క్రితం బడ్జెట్‌లో దిద్దుబాటు చర్యలు చేపట్టింది. రొయ్య ఎగుమతి సుంకాన్ని తగ్గించింది. దీనివల్ల దేశీయంగా రొయ్య ధరలు పెరగనున్నాయి. ఒకవైపు పెట్టుబడి వ్యయం తగ్గడంతోపాటు మరోవైపు ధరలు పెరిగితే రైతుకు లాభసాటిగా ఉంటుంది. వ్యాపారాలు జోరందుకోనున్నాయి. రొయ్య సాగుపై ఆధారపడ్డ వేలాది మందికి ఉపాధి లభించనుంది.

ఆక్వాకు మంచి రోజులు



ఆక్వాకు మంచి రోజులు వచ్చాయి. తెలుగుదేశం, జనసేన, బీజేపీ కూటమి ఎన్నికల ముందు ఇచ్చిన హామీని నెరవేరుస్తోంది. అందులో భాగంగానే మేత దిగుమతి పన్ను తగ్గించారు. ఇతర దేశాల నుంచి మేతను దిగుమతి చేసుకునే అవకాశం కల్పించారు. చేపల సాగులోనూ మేత ధర తగ్గేలా పన్ను తగ్గించారు. ఇవన్నీ రొయ్య, చేపల రైతులకు కలిసి రానున్నాయి. ఆక్వాతోపాటు, అనుబంధ రంగాలు అభివృద్ధి చెందనున్నాయి. రొయ్య సాగు వ్యాపారంలో అనుభవం ఉన్న వ్యక్తిగా చెబుతున్నా. కేంద్ర బడ్జెట్‌లో ఆక్వా రంగానికి పెద్ద పీట వేశారు. రాష్ట్ర ప్రభుత్వం సైతం సానుకూల నిర్ణయం తీసుకోనుంది. ఇవన్నీ ఆక్వా రంగానికి పూర్వ వైభవం తీసుకురానున్నాయి.

- మంతెన రామరాజు, టీడీపీ జిల్లా అధ్యక్షుడు

చేపలకూ సై

చేప సాగు ఒడిదుడుకులతో పయనిస్తోంది. ధరలు ఆశించిన స్థాయిలో లేవు. గతంలో టన్ను మేత రూ.1.50 లక్షలు లభ్యమైతే ఇప్పుడు రూ.2.50 లక్షలు పలుకుతోంది. దీంతో చేప మేతపైన కేంద్రం పన్ను తగ్గించింది. మేత ధరలే చేప సాగు కొంపముంచింది. కౌలుకు తీసుకుని సాగు చేసే సాహసం చేయలేకపోయారు. సొంత భూములున్న వారే చేపల సాగు చేస్తూ వస్తున్నారు. చేప మేత దిగి వస్తే మళ్లీ సాగు విస్తీర్ణం పెరగనుంది. చేపల మేతపై గతంలో ఉన్న 15 శాతం పన్నును ఐదు శాతానికి తగ్గించారు. మరోవైపు ప్రోసెసింగ్ యూనిట్‌లకు ప్రోత్సాహమిచ్చేలా కేంద్రం బడ్జెట్‌లో నిధులు కేటాయించింది. ఇవన్నీ ఆక్వా రంగాన్ని ఊతమివ్వనున్నాయి.



ఈ రోడ్లపై వెళ్లేదెలా ?

ఈ చిత్రం తాడేపల్లిగూడెం మండలం ప్రత్తిపాడు – నవాబుపాలెం మధ్య ఆర్‌అండ్‌బీ రహదారి. దీనిపై ప్రయాణించే వారికి గోతులు తప్ప రోడ్డు కనిపించదు. ఇటీవల కురిసిన వర్షాలకు మరింత అధ్వానంగా తయారైంది. ఇలాంటి పరిస్థితే జిల్లాలోని చాలా ప్రాంతాల్లో కనిపిస్తుంది. ఈ కారణంగా తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. మరోవైపు వాహనాలు తుక్కు తుక్కు అవుతున్నాయి. రోడ్ల విషయంలో గత వైసీపీ పాలకుల నిర్లక్ష్యమే ఇప్పటి దుస్థితికి కారణం. దీనిపై చంద్రబాబు సర్కార్ ప్రత్యేక దృష్టి పెట్టి వీటికి మరమ్మతులు చేయించాలని ప్రజలు కోరుతున్నారు. వివరాలు 7లో..



బంగారం తాకట్టు పెట్టి..

ఓ వ్యక్తి.. ఒక వ్యాపారి వద్ద బంగారు నగలను తాకట్టు పెట్టి రూ. 30 లక్షలు అప్పు తీసుకున్నాడు. వాటిని విడిపించేందుకు ఎంత కాలమైనా రాకపోవడంతో అనుమానంతో చూస్తే అవి నకిలీవని తేలింది. - 7లో

ఆంధ్రజ్యోతి ఫోకస్

ఇటీవల కురిసిన భారీ వర్షాలకు ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలోని రహదారులు మరింత ఛిద్రంగా మారాయి. అడుగుకో గొయ్యి మాదిరిగా.. గుంతల్లో వర్షపు నీరు నిలిచి వాహనదారులు తీవ్ర అవస్థలు ఎదుర్కొంటున్నారు. గత వైసీపీ ప్రభుత్వం రహదారుల అభివృద్ధిని పూర్తిగా గాలికి వదిలేసింది. కనీసం మరమ్మతులు కూడా చేయించలేదు. అడపాదడపా మరమ్మతులు చేసినప్పటికి నాసిరకంగానే పనులు చేయడంతో రోడ్లు అధ్వానంగా మారాయి. మరికొన్ని చోట్ల అభివృద్ధి పనులు ప్రారంభించినప్పటికీ కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించకపోవడంతో మధ్యలోనే నిలిపివేసిన సందర్భాలు ఉన్నాయి. దీనికంతటికి గత వైసీపీ ప్రభుత్వ తీరే కారణమని.. ఈ పాపం వైసీపీదేనని రోడ్ల మరమ్మతుల్లో భాగంగా ఒక్క తట్ట మట్టికూడా పోసిన సందర్భాలు లేవని ప్రయాణికులు, వాహనదారులు, ఆయా గ్రామాల స్థానికులు బాహాటంగానే విమర్శిస్తున్నారు. రహదారుల ఛిద్రం.. ప్రయాణికులు ఎదుర్కొంటున్న సమస్యలపై ఆంధ్రజ్యోతి ఫోకస్.


ఏలూరు–మాదేపల్లి సమీపంలో.. రోడ్డుపై భారీ గొయ్యి


భీమవరం నుంచి దెయ్యాలతిప్ప వెళ్లే ఆర్అండ్‌బీ రోడ్డు దుస్థితి


జాలిపూడి వద్ద రహదారి గోతులమయం

అడుగుకో గొయ్యి

ఉమ్మడి పశ్చిమలో రహదారులు ఛిద్రం

- గత వైసీపీ పాలనలో రోడ్ల అభివృద్ధికి చర్యలు నిల్
- ప్రయాణికులు, ఆయా ప్రాంతాల ప్రజలు ఆగ్రహం

ఆ రోడ్లపై నరక ప్రయాణమే..

తాడేపల్లిగూడెం రూరల్ : తాడేపల్లిగూడెం నుంచి తణుకు వెళ్లే రోడ్డు జువ్వలపాలెం వరకు.. ఆ తరువాత ప్రత్తిపాడు నుంచి నవాబుపాలెం వరకు రోడ్డులో వెళ్లాలంటే ఒళ్లు హూనమవుతుంది. మరో వైపు తాడేపల్లిగూడెం నుంచి ఏపీ నిట్ మీదుగా టిడ్కో ఇళ్ల దారిన వెళ్లే రోడ్డు పెద్దపెద్ద గోతులతో భయపెడుతున్నాయి. నవాబుపాలెం నుంచి జగన్నాథపురం మీదుగా వెంకట్రావుపాలెం వెళ్లే రోడ్డు మరింత దారుణంగా ఉంది.


తాడేపల్లిగూడెం నిట్ కళాశాల మీదుగా టిడ్కో ఇళ్లకు వెళ్లే రోడ్డు దుస్థితి

రహదారులు ధ్వంసం..

ఆచంట : ఆచంట నుంచి ములపర్రు వెళ్లే రహదారి ఆచంట కచేరి సెంటర్ నుంచి వేమవరం వెళ్లే రోడ్డు.. ఇటీవల కొత్తగా ఆచంట పోలీసు స్టేషన్ నుంచి మార్కెట్ రోడ్డుకు ఏర్పాటు చేసిన రహదారితోపాటు మరికొన్ని చోట్ల రహదారులు ధ్వంసమయ్యాయి. సంబంధిత శాఖల అధికారులు స్పందించి కనీసం మరమ్మతులు చేయాలని ఆయా స్థానికులు కోరుతున్నారు.


ఆచంట నుంచి ములపర్రు వెళ్లే రోడ్డు

చిత్తడిగా రహదారులు

పెంటపాడు : వర్షాలకు రహదారులు చిత్తడిగా మారాయి. గోతుల్లో వర్షపు నీరు చేరిపోవడంతో ప్రయాణాలు సాగించలేక వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రత్తిపాడు వై.జంక్షన్ నుంచి నవాబ్‌పాలెం వంతెన వరకు ఉన్న రహదారి పూర్తిగా ఛిద్రమైంది. మీనవల్లూరు నుంచి బి.కొండేపాడు, కె.పెంటపాడు నుంచి పడమ రవిప్పర్రు, చింతపల్లి నుంచి కోరుమిల్లి మీదుగా బి.కొండేపాడు, అలంపురం నుంచి ప్రత్తిపాడు తదితర రహదారులన్నీ చిత్తడిగా మారాయి.


పెంటపాడు మండలం మీనవల్లూరు–బీకొండేపాడు రహదారి

సమతానగర్ రోడ్డు పట్టించుకోండి.

ఆకివీడు : నలభై ఏళ్ళ నుంచి సమతానగర్ రోడ్డును పట్టించుకొనే నాథుడు లేరు. స్థానికులు పలుమార్లు పాలకులు, అధికారులు దృష్టికి తీసుకెళ్ళినా ఫలితం కనబడలేదు. ఎన్నికల సమయాల్లో హామీలు తప్ప పనులు చేసిన వారు లేదు. కూటమి ప్రభుత్వంలోనైనా రోడ్ల పనులు చేపడతారని సమతానగర్ వాసులు ఎదురుచూస్తున్నారు.


బురదమయంగా సమతానగర్ రోడ్

ఐదేళ్లుగా మరమ్మతులకు నోచుకోని రోడ్లు

ఇరగవరం : గత వైసీపీ ఐదేళ్ల పాలనలో మండలంలోని రహదారులు రాళ్లు తేలి, గోతులమయంగా మారాయి. అయితంపూడి గ్రామంలో ప్రధాన రహదారి తారు లేచి మట్టిరోడ్డుగా దర్శనమిస్తుంది. రోడ్డు మొత్తం గోతులు, బురదమయం కావడంతో వాహన దారులు ఇబ్బందులు పడుతున్నారు. ఓగిడి గ్రామంలో అయింతపూడి గ్రామానికి కలిపే రహదారి పొడవునా గోతులు నిలిచి చెరువులను తలపిస్తు న్నాయి. గ్రామాల్లో సరైన డ్రెయినేజీ వ్యవస్థ లేకపోవడంతో మురుగునీరు రోడ్లపై పారుతోంది. ఇరగవరం, కె. ఇల్లిందలపర్రు, తూర్పువిప్పర్రు, తదితర గ్రామాల్లో రోడ్లు అధ్వానంగా ఉన్నాయి.


అయింతంపూడి ప్రధాన రహదారిలో గోతులు

నిధులు కేటాయించినా.. జరగని పనులు

నరసాపురం రూరల్/ మొగల్తూరు : గత వైసీపీ ప్రభుత్వం రహదారి పనులకు నిధులు కేటాయించినా.. పనులు మాత్రం నాలుగేళ్లుగా ముందుకు సాగలేదు. కొత్త నవరసపురం నుంచి మేడపాడు వరకు సుమారు రూ.20 కోట్ల నిధులు మంజూరయ్యాయి. ఈ పనులకు అప్పటి ఎమ్మెల్యే ప్రసాదరాజు శంకుస్థాపన చేశారు. పనులు మాత్రం ముందుకు సాగలేదు. మొగల్తూరు మండలం మొగల్తూరు-వెంప, కాళీపట్నం పడమరలోని ఆర్అండ్‌బీ రహదారి పనులు గత ప్రభుత్వ హయాంలో ముందుకు సాగలేదు. కోమటితిప్ప-కోత్తోట గ్రామాల మధ్య ఆర్అండ్‌బీ రహదారి నిర్మాణానికి శంకుస్థాపన చేసినా పనులు ప్రారంభానికి నోచుకోలేదు.


గోతులమయంగా నవరసపురం రహదారి

12 కిలోమీటర్ల పొడవునా గోతులే..

భీమవరం రూరల్ : భీమవరం మండలం దెయ్యాలతిప్ప నుంచి భీమవరం వెళ్లే ఆర్అండ్‌బీ రహదారి అధ్వానంగా మారింది. 12 కిలోమీటర్లు పొడవునా గోతులతోను ఒక్కో చోట అడుగు లోతు గోతులతో వాహనదారులకు ప్రమాదకరంగా మారింది. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో సుమారు రూ.పది కోట్లతో రహదారి అభివృద్ధి చేశారు. గత వైసీపీ ప్రభుత్వం చిన్న మరమ్మతు చేయకపోవడంతో దారుణంగా మారింది.

బిల్లులు చెల్లించక నిలిచిన రోడ్డు పనులు

యలమంచిలి, జూలై 25: మేడపాడు, ఆర్యపేట, యలమంచిలి, చించినాడ, ఏనుగువానిలంక, నవరసపురం గ్రామాల మధ్య రహదారిలో చాలాచోట్ల గోతులు, పలుచోట్ల రహదారి కుంగిపోవడంతో రాకపోకలకు వాహనదారులు అవస్థలు పడుతున్నారు. చినుకుపడితే బురదమయంగా మారి గుంతల్లో వాహనాలు అదుపుతప్పి పడిపోతున్నారు. ముఖ్యంగా ఏనుగువానిలంక గ్రామ శివారులోనూ, బ్రాంచి కాలువ సమీపంలోనూ, ఘటాల చెరువు ప్రాంతాల్లో రహదారి ఒకవైపు దిగబడిపోయింది. సుమారు రెండున్నరేళ్ల క్రితం వైసీపీ ప్రభుత్వ హయాంలో రూ.4కోట్ల నిధులతో ఈ రోడ్డు విస్తరణ, అభివృద్ధి చేసేందుకు పనులు ప్రారంభించినప్పటికీ, కొంతకాలంపాటు పనులు నత్తనడకన సాగాయి. చేసిన పనులకు వైసీపీ ప్రభుత్వం బిల్లులు చెల్లించలేదని కాంట్రాక్టర్ పనులను నిలిపివేయడంతో ఈ రోడ్డు మరింత అధ్వానంగా మారింది.


యలమంచిలి–చించినాడ రహదారి

గ్రామీణ రహదారులు అధ్వానం

ఏలూరు రూరల్ : ఏలూరు రూరల్ మండలంలో సరైన రహదారి లేని గ్రామాలు అనేకం ఉన్నాయి. కొన్ని గ్రామాలకు సీసీ రోడ్లు వేస్తూ నిధుల కొరత కారణంగా పనులు నిలిచిపోయాయి. మరికొన్ని గ్రామాల్లో రహదారులు వేసేందుకు అనుమతులు వచ్చినా పనిచేసేందుకు కాంట్రాక్టర్లు ముందుకు రాకపోవడంతో పనులు ప్రారంభం కాలేదు. రూరల్ మండలం కాట్లంపూడి రహదారి పూర్తిగా ఛిద్రమైంది. మాదేపల్లి, జాలిపూడి వెళ్లే ప్రధాన రహదారి భారీ గోతులు పడి దర్శనమిస్తున్నాయి.


కాట్లంపూడిలో..

కొట్టుకుపోయిన రోడ్లు

బుట్టాయగూడెం : ఇటీవల ఏజెన్సీ ప్రాంతంలో కురిసిన భారీవర్షాలకు అటవీ ప్రాంతంలోని కొండరెడ్డి గ్రామాల్లో వేసిన రోడ్లు పూర్తిగా కొట్టుకుపోయాయి. ముంజులూరు నుంచి చింతపల్లి, గెడ్డపల్లి, ఉర్రింక, దార్వాడ, చిలకలూరు తదితర గ్రామాల్లో నిర్మించిన రోడ్లు పూర్తిగా దెబ్బతిన్నాయి. పాడైపోయిన రోడ్లను బాగుచేయాలంటూ ఐటీడీఏ అధికారులను కలిసి రెడ్లు వినతిపత్రం అందించారు.

గుంతలు పూడ్చండి మహాప్రభో!

చింతలపూడి : చింతలపూడి నగర పంచాయతీ, గురుపట్లగూడెం రోడ్లు రేచర్ల, ఎర్రగుంటపల్లి, ఫాతిమాపురం, శివపురం, లింగగూడెం, బుర్లగూడెం గ్రామాల్లోని ఆర్అండ్‌బీ రోడ్లతో పాటు పంచాయతీరాజ్ రోడ్లు దారుణంగా ఉన్నాయి. చింతలపూడి నుంచి సీతానగరం వరకు ఆర్అండ్‌బీ రోడ్డుఅంతా గోతులమయమైంది. రేచర్ల వద్ద మలుపులో భారీ గోతులతో బస్సులు తిరగలేని పరిస్థితి నెలకొంది. కనీసం వీటిని రాళ్లతో పూడ్చి మెరుగుపర్చాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.


గురుపట్లగూడెం రోడ్డులో భారీ గుంతలు

అదనపు పొగాకు అమ్మకాలకు కేంద్రం గ్రీన్ సిగ్నల్

- ఏలూరు ఎంపీ పుట్టా మహేష్‌కుమార్ హర్షం


కేంద్ర ప్రభుత్వ కార్యదర్శి సునీల్ బర్త్వల్‌తో ఎంపీ పుట్టా

జంగారెడ్డిగూడెం, జూలై 25 : రైతులు అదనంగా పండించిన వర్జీనియా పొగాకును అధీకృత వేలం కేంద్రాల్లో అమ్ముకోవడానికి, వేలం కేంద్రాల ద్వారా వ్యాపారులు కొనుగోలు చేయడానికి కేంద్రం గ్రీన్ సిగ్నల్ ఇచ్చిందని కేంద్ర ప్రభుత్వ కార్యదర్శి సునీల్ బర్త్వల్ ఉత్తర్వులు విడుదల చేశారని ఏలూరు ఎంపీ పుట్టా మహేష్‌కుమార్ గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన హర్షం వ్యక్తం చేసి మాట్లాడారు. మిచౌంగ్ తుఫాన్ వల్ల పంట నష్టపోయిన తరువాత ప్రభుత్వం అనుమతి ఇచ్చిన దానికంటే అదనంగా పొగాకు పండించామని, ఆ పొగాకును అపరాధ రుసుం లేకుండా కొనుగోలు చేయాలని ఈనెల పదో తేదీన దేవరపల్లిలో జరిగిన పొగాకు (టీఐఏ) రైతు అవార్డుల వేడుకల్లో రైతులు తన దృష్టికి తీసుకొచ్చారన్నారు. దీనిపై కేంద్ర మంత్రి పియూష్ గోయల్‌కు వివరించి అనుమతి కోరగా వెంటనే స్పందించి అపరాధ రుసుం లేకుండా అదనపు పొగాకును రైతులు అమ్ముకునేలా జీవో విడుదల చేశారన్నారు. ఒక పొగాకు బ్యారన్ లైసెన్సు కలిగిన ప్రతీ రైతు ఇప్పటివరకు 35 క్వింటాళ్ళ పొగాకు మాత్రమే పండించవలసి ఉండగా ఇక నుంచి 41.25 క్వింటాళ్ళ వరకు పండించుకోవడానికి కేంద్రం అనుమతిచ్చినట్టు తెలిపారు. త్వరలో పామాయిల్ రైతుల సమస్యలను పరిష్కరిస్తానని ఎంపీ పేర్కొన్నారు.

27,28 తేదీల్లో రాష్ట్రస్థాయి చెస్ క్రీడాకారుల ఎంపిక

భీమవరం అరన్, జూలై 25: అనసూయ చెస్ అకాడమి ఆధ్వర్యంలో ఆంధ్ర, జిల్లా అసోసియేషన్ సహకారంతో ఈనెల 27, 28 తేదీల్లో రాష్ట్రస్థాయి అండర్-11 ఓపెన్ గరల్స్ చదరంగం పోటీలు-2024 నిర్వహిస్తున్నట్టు జిల్లా చెస్ అసోసియేషన్ అధ్యక్షుడు మాదాసు కిషోర్ తెలిపారు. భీమవరంలోని ప్యాడీ రైస్ మర్చంట్స్ హాల్లో జరిగే పోటీల్లో గెలుపొందిన వారు అక్టోబరు 3 నుంచి 13 వరకు హైదారాబాదులో జరిగే జాతీయస్థాయి చెస్ చాంపియన్‌షిప్ రాష్ట్రం తరపున ప్రాతిధ్యం వహిస్తారన్నారు. వివరాలకు 90632 24466 నంబరులో సంప్రదించాలన్నారు.

28న సబ్ జూనియర్స్ బాస్కెట్‌బాల్ ఎంపిక పోటీలు

ఏలూరు రూరల్, జూలై 25: రాష్ట్ర స్థాయి అంతర్ జిల్లాల సబ్ జూనియర్ మినీ బాస్కెట్‌పోటీలు చిత్తూరు జిల్లాలో ఆగస్టులో జరగనున్నాయి. ఈమేరకు ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా బాలబాలికలకు ఈనెల 28న ఏలూరు కస్తూరిబా మున్సిపల్ హైస్కూల్ ప్రాంగణంలో సాయంత్రం మూడు గంటల నుంచి ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్టు ఉమ్మడి జిల్లా బాస్కెట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు కె.కృష్ణారెడ్డి తెలిపారు. ఆసక్తిగల క్రీడాకారులు మీసేవలో తీసుకున్న ఒరిజినల్ జనన ధ్రువీకరణ పత్రం, ఆధార్‌కార్డు తీసుకురావాలని సెక్రటరీ శ్రీను, ట్రెజరర్ కె.మురళీకృష్ణ తెలిపారు. మరింత సమాచారానికి 94411 71933 నంబరులో సంప్రదించాలన్నారు.

జాతీయస్థాయి 'ప్రేరణ'కు

వట్లూరు గురుకుల విద్యార్థిని


వి.అనుశ్రీ

పెదపాడు, జూలై 25 : జాతీయస్థాయి శిక్షణ కార్యక్రమం ప్రేరణకు పెదపాడు మండలం వట్లూరులోని బాలయోగి గురుకుల పాఠశాలలో పదో తరగతి విద్యార్థిని వంపుగాని అనుశ్రీ ఎంపికవ్వడం పట్ల విద్యార్థినికి ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ యాదవ్ ఓ ప్రకటనలో ప్రత్యేక అభినందనలు తెలిపారు. దేశవ్యాప్తంగా పది జిల్లాల నుంచి 20 మంది విద్యార్థులను ఎంపిక చేయగా వారిలో మన రాష్ట్రం నుంచి ఏలూరు జిల్లాకు చెందిన అనుశ్రీ ఎంపిక కావడం విశేషం. యువతలో సాధికారిత కల్పించడం, రూపాంతరమైన, అనుభవ పూర్వక అభ్యాసనే ప్రేరణ కార్యక్రమ ముఖ్య ఉద్దేశం కాగా దీనికి ఎంపికైన విద్యార్థిని అనుశ్రీ దేశ రాజధాని ఢిల్లీలో జరిగే స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో పాల్గొంటుంది. ప్రేరణ శిక్షణ కార్యక్రమానికి ఎంపికైన బాలికను మండల విద్యాశాఖాధికారులు అభినందించారు.

క్రైం సమాచారం

చికిత్స పొందుతూ బెంగాలీ కూలీ మృతి


లింగపాలెం, జూలై 25 :వ్యవసాయ పనుల నిమిత్తం పశ్చిమ బెంగాల్ నుంచి వచ్చిన వ్యవసాయ కూలీ బైక్ ఢీ కొని మృతి చెందిన ఘటన లింగపాలెం మండలంలో జరిగింది. ధర్మాజీగూడెం ఎస్ఐ చెన్నారావు తెలిపిన వివరాలివి.. మండలంలోని ఆసన్నగూడెంకు వరినాట్ల నిమిత్తమై బెంగాల్ నుంచి పలువురు కూలీలు వలస వచ్చినట్టు తెలిపారు. ఈ సందర్భంగా బెంగాల్‌కు చెందిన మనోరంజన్ మండల్(56) అనే వ్యక్తి ఈ నెల 22న పనుల అనంతరం కూరగాయలు తీసుకుని వెళుతుండగా వెనుక నుంచి బైక్ ఢీ కొట్టడంతో తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం ఏలూరులోని ఆంధ్ర హాస్పిటల్‌కు తీసుకువెళ్లి మెరుగైన చికిత్సకు విజయవాడ తీసుకువెళ్ళగా అక్కడ చికిత్స పొందుతూ గురువారం మృతి చెందినట్లు ఎస్ఐ పి.చెన్నారావు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

లారీ ఢీకొని ఒకరి మృతి.. మరొకరికి గాయాలు


సునీల్‌బాబు (ఫైల్)

యలమంచిలి, జూలై 25: అడవిపాలెం గ్రామం ప్రధానరహదారిపై గురువారం రాత్రి లారీ ఢీకొనడంతో మోటారు సైకిల్‌పై వెళుతున్న ఒకరు మృతి చెందగా.. మరొకరికి తీవ్ర గాయాలయ్యాయని ఎస్ఐ కె.శివన్నారాయణ తెలిపారు. మట్లపాలెం గ్రామం కట్టావారిపాలెం ప్రాంతానికి చెందిన కప్పల సునీల్‌బాబు(34), అబ్బిరాజుపాలెం గ్రామానికి చెందిన చిట్టూరి దుర్గాప్రసాద్ మోటార్‌సైకిల్‌పై పాలకొల్లు వెళ్లి పనులు ముగించుకుని గ్రామానికి తిరిగి వెళుతున్నారు. అడవిపాలెం వినాయకుని ఆలయానికి సమీపంలో ప్రధాన రహదారిపై వెనుక నుంచి వస్తున్న లారీ ఢీ కొట్టడంతో కప్పల సునీల్‌బాబు(34) మృతి చెందాడు. చిట్టూరి దుర్గాప్రసాద్‌కు తీవ్ర గాయాలయ్యాయి. మృతుడు పాలకొల్లులోని ప్రైవేటు ఫైనాన్స్ సంస్థలో ఫీల్డ్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్నాడు. వీరిని పాలకొల్లు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. దీనిపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

మద్యం దుకాణం దగ్ధంపై ప్రత్యేక దర్యాప్తు


దగ్ధమౌతున్న ప్రభుత్వ మద్యం దుకాణం

భీమవరం క్రైం, జూలై 25 :భీమవరం పట్టణ పరిధిలోని తాడేరు రోడ్డులో ఉన్న ప్రభుత్వ మద్యం దుకాణం బుధవారం రాత్రి దగ్ధమైంది. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది అక్కడకు వెళ్లి మంటలను అదుపు చేశారు. మద్యం సీసాలు పూర్తిగా దగ్ధమయ్యాయి. లాకర్‌లో ఉంచిన లక్షా 90 వేల రూపాయల నగదు మాత్రం బయటకు తీశారు. ఈ ప్రమాదం షార్ట్ సర్క్యూట్ వల్ల జరిగిందా, కావాలనే ఎవరైనా దగ్ధం చేశారా ? అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. విజయవాడ నుంచి క్లూస్ టీమ్, డాగ్ స్క్వాడ్‌లు వచ్చి పరిశీలన చేశాయి. ఇంకా ఆస్తి నష్టం అంచనా వేయాల్సి ఉందని భీమవరం ఎక్సైజ్ ఎస్ఐ చంద్రశేఖర్ తెలిపారు.

ఆసుపత్రికి వెళితే.. ఇంట్లో చోరీ

- నాలుగు కాసుల బంగారం అపహరణ



ఆకివీడు, జూలై 25 : ఇంటికి తాళం వేసి భర్తను భీమవరం ఆసుపత్రికి తీసుకెళితే ఇంట్లో దొంగలు పడి బంగారం దోచుకెళ్లిన ఘటన దుంపగడపలో జరిగింది. ఎస్ఐ బత్తిన నాగబాబు తెలిపిన వివరాలివి.. గ్రామానికి చెందిన పిన్నమరాజు స్వప్న తన భర్త సూరపరాజును ఈ నెల 22న భీమవరం ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తీసుకెళ్ళింది. గురువారం ఉదయం బంధువులు స్వప్నకు ఫోన్ చేసి మీ ఇంటి తలుపులు తీసి ఉన్నాయని తెలపడంతో సత్వరమే వచ్చి చూసేసరికి తాళం పగుల కొట్టి ఉంది. ఇంటిలోకి వెళ్లి పరిశీలించగా బీరువా తెరిచి బట్టలు చిందరవందరచేసి నాలుగు కాసుల బంగారు ఆభరణాలు అపహరణకు గురైనట్టు గుర్తించింది. పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఎస్ఐ బత్తిన నాగబాబు ఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

నకిలీ బంగారంతో రూ.లక్షల టోకరా !

- తనిఖీల్లో బయటపడ్డ వైనం..
- కేసు పెట్టేందుకు నరసాపురంలో వ్యాపారుల తర్జనభర్జన



నరసాపురం, జూలై 25: నకిలీ బంగారం తాకట్టు పెట్టి వ్యాపారులను బురిడీ కొట్టించిన ఘటన నరసాపురంలో వెలుగుచూసింది. నమ్మకంగా బంగారం తాకట్టు పెడుతూ వ్యాపారుడిని నమ్మించి చివరికి రూ.30 లక్షలపైనే టోకరా వేశారు. వడ్డీ పెరిగిపోవడం, విడిపించుకునేందుకు రాకపోవడంతో అనుమానం వచ్చి వస్తువుల్ని పరీక్ష చేయగా.. అసలు విషయం బయటపడింది. వ్యాపారులు కేసు పెట్టేందుకు సిద్ధం అవుతున్నారు. జిల్లాలో నరసాపురం తాకట్టు వ్యాపారులకు పెట్టింది పేరు, నిత్యం కోట్ల రూపాయల లావాదేవీలు జరుగుతుంటాయి. నమ్మకంగా ఉన్న వారికి అవసరాన్ని బట్టి అప్పు ఇస్తారు, బ్యాంకు కంటే గ్రాముకు ఎక్కువ మొత్తంలో అప్పు ఇస్తుండడంతో చాలామంది వ్యాపారుల వద్దే వస్తువుల్ని తాకట్టు పెడుతుంటారు. ఇదే నమ్మకాన్ని ఒక కేటుగాడు తరచూ వస్తువుల్ని తాకట్టు పెడుతూ మళ్లీ విడిచిపించుకుంటూ ఉండేవాడు. చాలాఏళ్లుగా సాగుతుండడంతో అతడిపై నమ్మకం ఏర్పడింది. ఒకటి రెండు సార్లు కేటుగాడు తాకట్టు పెట్టిన వస్తువుల్ని గీటు వేయకుండా అప్పు ఇస్తుండడంతో అతడి ఆలోచన మారింది. నకిలీ ఆభరణాలు పెట్టి అప్పు తీసుకోవాలని ప్రణాళిక చేసి.. దానికి అనుగుణంగా ఆభరణాలను పెట్టి లక్షల్లో అప్పు తీసుకున్నాడు. సకాలంలో కట్టకపోవడంతో వ్యాపారికి అనుమానం వచ్చి వాటిని చెక్ చేస్తే నకిలీ ఆభరణాలు అని తేలింది. దీంతో వ్యాపార సంఘాన్ని ఆశ్రయించాడు. కేసుపై వ్యాపారులు తర్జనభర్జన పడుతున్నారు. అయితే ఈ మోసంపై వ్యాపారులెవ్వరూ నోరు మెదపడం లేదు.

పెట్రోల్ పోసి నిప్పంటించిన విద్యార్థిపై కేసు

- బాధిత బాలుడి చికిత్స కోసం విజయవాడ తరలింపు

ఏలూరు క్రైం, జూలై 25 : ఏలూరు విద్యానగర్‌లో ఉన్న బాయిస్ కాన్వెంట్‌లో బుధవారం తోటి విద్యార్థిపై పెట్రోల్ పోసి నిప్పంటించిన ఉండి మండలం చెరుకువాడ విద్యార్థిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టామని త్రీ టౌన్ పోలీసులు తెలిపారు. ప్రస్తుతం ఆ బాలుడిని ఇంతవరకూ అరెస్టు చేయలేదు. రెండు రోజుల్లో అరెస్టు చేయనున్నట్టు ప్రాథమిక సమాచారం. అరెస్టు చేసి జువైనల్ కోర్టుకు హాజరుపర్చనున్నట్టు తెలిసింది. స్కూలు సమీపంలో ఉన్న గాయపడిన బాలుడిని మిషనరీ ఆసుపత్రిలో ఉంచి వైద్యం అందిస్తున్నారు. అక్కడ నుంచి ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించగా.. మెరుగైన వైద్యం కోసం విజయవాడ ఆసుపత్రికి వైద్యులు రిఫర్ చేశారు. తొలుత బాధిత బాలుడిని దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ గురువారం ఉదయం పరామర్శించి ఆ కుటుంబానికి ధైర్యం కల్పించారు.

ఊరెళ్లి వచ్చేసరికి ఇంటిని దోచేశారు

- ఆరు కాసుల బంగారం, రూ.50 వేల నగదు అపహరణ

జంగారెడ్డిగూడెం, జూలై 25 : తాళం వేసి ఉన్న ఇంట్లో దుండగులు ప్రవేశించి నగదు, బంగారం దోచుకెళ్లిన ఘటన జంగారెడ్డిగూడెం పట్టణంలోని మార్కండేయపురంలో గురువారం జరిగింది. ఎస్ఐ జ్యోతి బసు తెలిపిన వివరాలివి.. హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో నర్సుగా చల్లగాలి దుర్గాభవాని పనిచేస్తున్నారు. మార్కండేయపురంలో ఆమె ఇంటికి మరమ్మతులు చేయించే నిమిత్తం కొద్దిరోజుల క్రితం పట్టణానికి వచ్చారు. ఈనెల 22న బుట్టాయగూడెం మండలంలోని దొరమామిడిలో తన తల్లి ఇంటికి వెళ్లి తిరిగి 24వ తేదీ సాయంత్రం ఇంటికి రాగా.. ఇంటి తాళం పగలగొట్టి ఉండడం చూసి లోపలికి వెళ్లగా బీరువాలో ఉన్న ఆరు కాసుల బంగారు ఆభరణాలు, రెండు జతల వెండి పట్టీలు, రూ.50 వేల నగదు అపహరణకు గురైనట్టు గుర్తించారు. ఈ మేరకు బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

అసెంబ్లీ పాయింట్..

కారుమూరిపై ఏసీబీ విచారణ జరిపించాలి



తణుకులో జరిగిన టీడీఆర్ కుంభకోణంలో ప్రధాన సూత్రధారి మాజీ మంత్రి కారుమూరిపై ఏసీబీ విచారణ వేసి నిజాలు వెలికి తీయాలి. రాష్ట్రంలో పట్టణాభివృద్ధి కోసం ఒక మంచి ఉద్దేశంతో టీడీఆర్ బాండ్లను చంద్రబాబు ప్రవేశపెట్టారు. 2019-24వరకు వైసీపీ పాలనలో రాష్ట్రవ్యాప్తంగా పెద్దఎత్తున 3,300 టీడీఆర్ బాండ్ల మంజూరు వెనుక ఆలోచన చూస్తే విశాఖ నుంచి చిత్తూరు వరకు కుంభకోణం జరిగింది. వైసీపీ పాలనలో కొత్తగా దోపిడీలు ఎలా చేయాలి ? అరవై రోజుల్లో అక్రమార్జన ఎలా? దొరక్కుండా స్కామ్‌లు ఎలా చేయాలో పుస్తకాలు ప్రచురించవచ్చు. తణుకులోనే 61 టీడీఆర్ బాండ్లు మంజూరు చేసి 1,48,439 స్క్వేర్ మీటర్లకు గాను 36 ఎకరాలు సేకరించారని, దానికి సంబంధించి 5,93,759 గజాల బాండ్లు ఇచ్చి 146 ఎకరాలు ఈక్వలెంట్‌గా ఇచ్చారని దీనివిలువ వేల కోట్లలో ఉంటుంది. 2014-19 వరకు తణుకులో ఆరువేల గజాలకు మాత్రమే టీడీఆర్ బాండ్లు ఇస్తే, వైసీపీ పాలనలో 1,48,439 గజాలకు బాండ్లు ఇచ్చారు. అందులో 1:2 శాతం ఇవ్వాల్సిన చోట 1:4 శాతం వ్యాల్యూ ఇచ్చారని, డోర్ నెంబర్లు మార్చి అగ్రిమెంట్లు మీద ఉన్న వాటికి టీడీఆర్ బాండ్లు ఇచ్చి రకరకాలుగా దోపిడీ చేశారు.

- ఆరిమిల్లి రాధాకృష్ణ, ఎమ్మెల్యే, తణుకు


శ్రీవారి ఆలయ హుండీల సొమ్ము లెక్కిస్తున్న సిబ్బంది

శ్రీవారి హుండీల ఆదాయం రూ.2.41 కోట్లు

ద్వారకాతిరుమల, జూలై 25: ద్వారకాతిరుమలేశుని హుండీల లెక్కింపు ఆలయ ప్రాంగణంలోని ప్రమోద కల్యాణమండప ఆవరణలో గురువారం నిర్వహించారు. అత్యంత భద్రతా ఏర్పాట్ల నడుమ జరిగిన ఈ హుండీల లెక్కింపు ద్వారా గడిచిన 28 రోజుల కాలానికి గాను స్వామికి రూ.2,41,72,018 భారీ ఆదాయం సమకూరింది. నగదుతో పాటు భక్తులు సమర్పించిన కానుకల రూపేణా 401 గ్రాముల బంగారం, 6.222 కేజీల వెండి లభించిన ట్లు ఈవో వి.త్రినాథరావు తెలిపారు. రద్దయిన పాతనోట్లు రూ.500 (12), 1000(1), 2000(82)తో పాటుగా పలుదేశాల కరెన్సీ సైతం అధికంగా లభించింది.

11 నెలలుగా జీతాల్లేవ్..

- ఏలూరు ప్రభుత్వ మెడికల్ కాలేజీ పారిశుధ్య కార్మికులు, సెక్యూరిటీ సిబ్బంది ఆందోళన

ఏలూరు క్రైం, జూలై 25 :ఏలూరు ప్రభుత్వ మెడికల్ కాలేజీలో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులు, సెక్యూరిటీ సిబ్బందికి 11 నెలలుగా జీతాలు లేకపోవడంతో ఆందోళన చేపట్టారు. గత ప్రభుత్వం హయాం నుంచి 11 నెలలుగా జీతాలు ఇవ్వకపోవడంతో ప్రతినెలా ఆ సొమ్ముల కోసం ఎదురు చూస్తూనే ఉన్నారు. మొత్తం 35 మంది సిబ్బంది విధులు నిర్వర్తిస్తున్నారు. జీతాలు రాకపోవడంతో ఏపీ మెడికల్ ఎంప్లాయీస్ కాంట్రాక్ట్ అండ్ ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల సంఘ జిల్లా కార్యదర్శి వి.దత్తాత్రేయ (దత్తు) నాయకులు పి.విజయ, వినోద్, ప్రభావతుల ఆధ్వర్యంలో గురువారం ఉదయం ఏలూరు ప్రభుత్వ మెడికల్ కాలేజీ వద్ద విధులను బహిష్కరించి ఆందోళన చేపట్టారు. జీతాలు చెల్లించకపోతే తామంతా విధులను బహిష్కరించి నిరవధిక సమ్మెలోకి వెళ్తామని ప్రకటించారు. మరోవైపు ఈ సమస్యను ఎమ్మెల్యే బడేటి చంటి దృష్టికి తీసుకెళ్లేందుకు ప్రయత్నించగా ఆయన అసెంబ్లీ సమావేశాల్లో ఉన్నారని ఈ సమస్యను ఎమ్మెల్యే పరిష్కరిస్తారని, ఎలాంటి ఆందోళనలు చేయవద్దని యథావిధిగా విధులను కొనసాగించాలని ఎమ్మెల్యే కార్యాలయం నుంచి సమాచారం రావడంతో ఆందోళన విరమించారు.

లోకేశ్‌ను కలిసిన నాగేశ్వరరావు



భీమవరం అర్బన్, జూలై 25: రాష్ట్ర మంత్రి నారా లోకేశ్‌ను ఏఎంసీ మాజీ చైర్మన్, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కోళ్ళ నాగేశ్వరరావు విజయవాడ అసెంబ్లీలో ఆ యన చాంబర్‌లో గురువారం మర్యాదపూర్వంగా కలిశారు. ఐదేళ్లలో పార్టీకోసం ఏపని చెప్పిన అంకితభావంతో పనిచేశారని కోళ్లను లోకేశ్‌బాబు అభినందించారు.

కార్మికులకు నష్టపరిహారం చెల్లించడం లేదు

భీమవరం అర్బన్, జూలై 24: పరిశ్రమలు మూసివేస్తున్న యాజమాన్యాలు కార్మికులకు నష్టపరిహారం చెల్లించడం లేదని సీఐటీయూ జిల్లా అధ్యక్షకార్యదర్శులు జేఎన్‌వీ గోపాలన్, కె.రాజారామ్మోహన్‌రాయ్ ఆరోపించారు. గణపవరం మండలం సరిపల్లిలోని థాయ్‌లాండ్‌కు చెందిన సీపీఎస్ కాంట్రాక్ట్ కార్మికులకు నష్టపరిహారం చెల్లించాలని గురువారం కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. అనంతరం కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు.

తరటావ సర్పంచ్‌గా నాగేశ్వరరావు



ఆకివీడు, జూలై 25 : తరటావ సర్పంచ్‌గా టీడీపీకి చెందిన ముప్పానేని నాగేశ్వరరావు నియమితులయ్యారని గురువారం ఆయన విలేకర్లకు తెలిపారు. గత ఎన్నికల్లో వైసీపీ బలపరచిన కూనపరాజు ప్రసాద్‌రాజు సర్పంచ్‌గా బాధ్యతలు నిర్వహించారు. ప్రసాద్ రాజు సర్పంచ్ పదవికి రాజీనామా చేయడంతో ఉప సర్పంచ్‌గా ఉన్న తనకు జిల్లా పంచాయతీరాజ్ అధికారి నుంచి సర్పంచ్‌గా బాధ్యతలు చేపట్టాలని ఉత్వర్వ్యులు వచ్చినట్టు తెలిపారు.

ఉపాధి బకాయిలు చెల్లించాలి

భీమవరం రూరల్, జూలై 25 : ఉపాధి హామీ బకాయిలు చెల్లించాలని సీఐటీయూ మండల కార్యదర్శి ఇంజేటి శ్రీనివాస్ డిమాండ్ చేశారు. కరుకువాడ బేతపూడి సచివాలయం వద్ద గురువారం ఉపాధి కార్మికులు నిరసన వ్యక్తం చేస్తూ వెల్ఫేర్ అసిస్టెంట్ మహేష్‌కి వినతిపత్రం అందించారు. శ్రీనివాస్ మాట్లాడుతూ ఉపాధి హామీ పనులు చేసి మూడు నెలలు గడుస్తున్నా నేటికి పూర్తిగా చెల్లించలేదన్నారు. బుంగ జాన్, మంద పెద్దబుజ్జి, బుంగ లక్ష్మీకాంత్, బుంగ ఏసురత్నం, తదితరులు పాల్గొన్నారు.

హెచ్‌ఎంలకు టీచింగ్ టూల్స్

పాలకొల్లు అర్బన్, జూలై 25 : స్థానిక బీఆర్‌ఎంవీఎం హైస్కూల్లో జరుగుతున్న హెచ్‌ఎంల టీచింగ్ టూల్స్ కార్యక్రమాన్ని గురువారం ఎంఈవో వీరాస్వామి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా తరపున 14 మంది మాస్టర్ ట్రైనర్స్ రాష్ట్ర స్థాయిలో శిక్షణ పొంది. జిల్లాలోని మూడు కేంద్రాల్లో 300 మంది హెచ్‌ఎంలకు శిక్షణ ఇస్తున్నారన్నారు. ఆర్‌ఎన్‌ఎస్‌వీజీ శర్మ (2), మాస్టర్ ట్రైయినీలు లక్ష్మీనారాయణ, నరేష్ పాల్గొన్నారు.

మైనర్లు బైకులు నడిపితే కేసులు

ఆకివీడు, జూలై 25 : లైసెన్సు లేకుండా వాహనాలు నడిపితే మైనర్లపై కేసులు నమోదు చేసి, బైకులనుసీజ్ చేస్తామని ఎస్ఐ బత్తిన నాగబాబు హెచ్చరించారు. పట్టణ పరిధిలో కళాశాల వద్ద లైసెన్సు లేకుండా బైకులు నడుపుతున్న యువతకు గురువారం అవగాహన కల్పించారు.

నరసాపురం ఎంపీడీవోకు నివాళి

ఆచంట, జూలై 25 : స్థానిక ఎంపీడీవో కార్యాలయం వద్ద నరసాపురం ఎంపీడీవో వెంకటరమణ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఎంపీడీవో పి.నరసింహ ప్రసాద్, ఎంపీపీ దిగుమర్తి సూర్య కుమారి, జడ్పీటీసీ ఉప్పలపాటి సురేష్‌బాబు, వైస్ ఎంపీపీ తాళం శ్రీనివాస్ ఉన్నారు.

ల్యాండ్ టైటిలింగ్ చట్టం రద్దుపై హర్షం



హర్షం వ్యక్తం చేస్తున్న న్యాయవాదులు

భీమవరం క్రైం, జూలై 25 : భీమవరం కోర్టుల సముదాయంలో ల్యాండ్ టైటిలింగ్ చట్టం రద్దుపై న్యాయవాదులు, శ్రీవిజ్ఞాన వేదిక, బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా భీమవరం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఏలేటి న్యూటన్, చెరుకువాడ రంగసాయి, బార్ అసోసియేషన్ కార్యదర్శి అడపా ప్రసన్నకుమార్, వైస్ ప్రెసిడెంట్ కె.వెంకటరావు, జాయింట్ సెక్రటరీ జె.సత్తిబాబు, తదితరులు పాల్గొన్నారు.

విద్యా సామగ్రి అందజేత

ఆచంట, జూలై 25 : వల్లూరులో ఉన్న హాస్టల్ విద్యార్థులకు గురువారం నోటు పుస్తకాలు , పెన్నులు, ప్యాడ్‌లు అందజేశారు. ఎంపీపీ దిగుమర్తి సూర్య కుమారి, జడ్పీటీసీ ఉప్పలపాటి సురేష్‌బాబు, సర్పంచ్ నేలపూడి బేబి, వైస్ ఎంపీపీ తాళం శ్రీనివాస్, ఎంపీటీసీ ఆరిమిల్లి సుబ్బారావు, ఎంపీడీవో నరసింహ ప్రసాద్, హాస్టల్ వార్డెన్ నరసమ్మ పాల్గొన్నారు.

ప్రత్యేక చట్టాలతో మహిళలకు రక్షణ

తాడేపల్లిగూడెం రూరల్, జూలై 25: ప్రత్యేక చట్టాలతో మహిళలకు భద్రత పెరుగుతుందని జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ పీడీ సుజాత రాణి అన్నారు. తాడేపల్లిగూడెం 17వ వార్డు అంగన్‌వాడీ కేంద్రం వద్ద కొత్త చట్టాలపై మహిళలకు, విద్యార్థినుకు అవగాహన కల్పించారు. సీడీపీవో టీఎల్ సరస్వతి, సూపర్‌వైజర్‌లు సీహెచ్ దుర్గాభవాని, విశాలాక్షి, సుజాత పాల్గొన్నారు.

ఆంగ్ల భాషలో రాణించాలి

పెంటపాడు, జూలై 25: విద్యార్థులు మాతృభాషతో పాటు ఆంగ్లంలో కూడా ప్రావీణ్యం సాధించాలని ఫుడ్స్ ఫ్యాట్స్ డైరెక్టర్ సీమా గోయెంకా అన్నారు. ప్రత్తిపాడు 3-ఎఫ్ స్వాభిమాన్ ఫౌండేషన్ సహకారంతో పెంటపాడు గోయెంకా ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఇంగ్లీష్ ల్యాబ్‌కు రూ. 5.50 లక్షల విలువ చేసే 10 కంప్యూటర్లను అందజేశారు. సీమా గోయెంకా గురువారం ల్యాబ్‌ను ప్రారంభించారు. ప్రిన్సిపాల్ ఎస్.వెంకటేశ్వరరావు, ఫుడ్స్ ఫ్యాట్స్ అసిస్టెంట్ మేనేజర్ శ్రీనివాసరెడ్డి, కో ఆర్డినేటర్ వి.శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

ముంపు ప్రాంతాల్లో అధికారుల పర్యటన



వద్దిపర్రులో ముంపు ప్రాంతాలను పరిశీలిస్తున్న ఆర్డీవో అచ్చుత్ అంబరీష్, రెవెన్యూ సిబ్బంది



పడమరవిప్పర్రులో మునిగిన వరి చేలు పరిశీలిస్తున్న ఏడీఏ, ఏవో



మోగల్లులో వరద బాధితులకు హైజనిక్ కిట్స్ అందజేస్తున్న రెడ్ క్రాస్ సిబ్బంది

పోడూరు, జూలై, 25 : నక్కల డ్రైన్ ఉధృతికి గురైన వదిపర్రులోని ముంపు ప్రాంతాలలో గురువారం నరసాపురం ఆర్డీవో అచ్యుత్ అంబరీష్ రెవెన్యూ సిబ్బందితో కలిసి పర్యటించారు. వరద తాకిడికి నీటముంపులో కుళ్లి పోయిన వరి నారుమళ్లను పరిశీలించారు. లోతెట్టు ప్రాంతంలో ఉన్న 30 కుటుంబాలకు 10 కిలోలు చొప్పు న బియ్యం పంపిణీ చేశారు. అనంతరం అధికారులను నక్కల డ్రైన్‌పై ఆరా తీశారు. వరద ముంపు ధాటికి కుళ్లిపోయిన వరి నారుమళ్లకు నష్టపరిహారం ఇప్పించా లని రైతులు ఆర్డీవోకు విన్నవించుకున్నారు. అధైర్య పడొద్దని ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. సర్పంచ్ వడ్లపాటి రాజేంద్రప్రసాదు, ఎంపీటీసీ విప్పర్తి శారద, మాజీ ఎంపీటీసీ శీలం శ్రీనివాసరావు, తహసీల్దార్ మురళీకృష్ణ, ఆర్ఐ కందుల రాంబాబు, ఎలక్ట్రికల్ ఏఈ శ్రీనివాసరావు తదితరులు ఆర్డీవో వెంట ఉన్నారు.

పొటాషియం, యూరియా చల్లుకోవాలి

పెంటపాడు, జూలై 25 : రైతులు వరి నాట్లు పూర్తి అయిన పొలాల్లో నీరు బయటకు వెళ్ళిన వెంటనే బూస్ట ర్ డోస్‌లో భాగంగా ఎకరాకు 20 కేజీల యూరియా, 20 కేజీల పొటాషియం చల్లుకోవాలని తాడేపల్లిగూడెం డివిజన్ వ్యవసాయ శాఖ ఏడీఏ మురళీకృష్ణ, ఏవో పార్థసారథి సూచించారు. మండలంలోని పడమర విప్పర్రు, మౌంజీపాడు, పరిమెళ్ళ, యానాలపల్లి తదితర గ్రామాల్లో ముంపునకు గురైన పొలాలను పరిశీలిం చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నారుమడు లు వేసుకున్న పొలాల్లో ఎకరాకు ఒక కేజీ యూరియా, కేజీ పొటాషియం చల్లుకోవాలని, అలాగే ఒక గ్రాము బావిస్టన్ మందును లీటరు నీటిలో కలిపి పిచికారీ చేసుకోవాలన్నారు.

హైజనిక్ కిట్స్ అందజేత

భీమవరం టౌన్, జూలై 25 : ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ వెస్ట్ గోదావరి శాఖ ఆధ్వర్యంలో, ఇటీవల కురిసిన భారీ వర్షాలకు గోస్తనీ నదికి గండి పడటం వల్ల ముంపునకు గురైన పాలకోడేరు మండలం, మొగల్లు, గుత్తులు వారుపాలెం, ఎస్టీ కాలనీలోని 33 కుటుంబాలకు కలెక్టర్ ఆదేశాల మేరకు హైజనిక్ కిట్స్ అందజేశారు. ఈ కార్యక్రమంలో రెడ్ క్రాస్ జిల్లా చైర్మన్ శివరాంభద్రరాజు, సీనియర్ లైఫ్ మెంబర్ గోపిశెట్టి మురళి కృష్ణారావు, కోఆర్డినేటర్ మల్లేశ్వరరావు, మం డల ఎమ్మార్వో, వీఆర్వో, గ్రామ సర్పంచ్ తదితరులు పాల్గొన్నారు

ఆదాయ పన్ను చెల్లింపుతోనే దేశాభివృద్ధి



సెమినార్‌లో మాట్లాడుతున్న శ్రీరామచంద్రమూర్తి

పాలకొల్లు, జూలై 25 : ఆదాయ పన్ను చెల్లించి దేశ సంక్షేమానికి, అభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలని ఐటీ అధికారి ఆర్.శ్రీరామచంద్రమూర్తి అన్నారు. స్థానిక చాంబర్స్ డిగ్రీ, పీజీ కళాశాల సెమినార్ హాల్లో గురువారం జరిగిన ప్రిన్సిపాల్ డాక్టర్ డి.వెంకటేశ్వరరావు జరిగిన కార్యక్రమంలో ఇన్ కంట్యాక్స్‌పై అవగాహన కల్పించారు. కళాశాల చైర్మన్ కేవీఆర్ నరసింహారావు, కార్యదర్శి కె.రామరాజు, గౌరవ అతిథులు పి.లక్ష్మీనారాయణ మాట్లాడారు. పాలకొల్లు ఐటీ ఇన్‌స్పెక్టర్ శిరీష, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ వోల్గా, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

● తణుకు : స్థానిక బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థులకు ఆదాయ పన్నుశాఖాధికారి సీవీకే దొర, పీవీవీ సత్యనారాయణ పలు అంశాల పై అవగాహన కల్పించారు. హెచ్‌ఎం పద్మావతి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పించండి

కలెక్టర్ నాగరాణి



సంక్షేమ శాఖ అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ నాగరాణి

భీమవరం టౌన్, జూలై 25 : జిల్లాలోని సంక్షేమ వసతి గృహాలలో విద్యార్థులకు మెరుగైన వసతి కల్పించేందుకు సంబంధిత అధికారులు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి ఆదేశించారు. స్థానిక కలెక్టర్ చాంబర్‌లో సంక్షేమ వసతి గృహాల అత్యవసర మరమ్మతులపై ఎస్సీ, ఎస్టీ, బీసీ సంక్షేమ శాఖల అధికారులతో గురువారం కలెక్టర్ సమీక్షించారు. జిల్లాలో మొత్తం 46 ఎస్సీ, ఎస్టీ, బీసీ సంక్షేమ వసతి గృహాలు నిర్వహిస్తుండగా, వీటిలో 35 వసతి గృహాలు ప్రభుత్వ భవనాల్లో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వీటిలో ఎస్సీ 25, బీసీ తొమ్మిది, ఎస్టీ ఒక వసతి గృహాల్లో ఉన్నాయన్నారు. వీటి మరమ్మతులకు సుమారు రూ.2.65 కోట్ల అంచనాలతో గృహ నిర్మాణ శాఖ ప్రతిపాదనలు సమర్పించిందన్నారు. ఎస్సీ వెల్ఫేర్‌కు సంబంధించి తాడేపల్లిగూడెం పరిమళ, తణుకు బాలికలు, పాలకొల్లు ఆనంద నిలయం, పెంటపాడు బాయ్స్‌గర్ల్స్ వసతి గృహాలు, బీసీ వెల్ఫేర్‌కు సంబంధించి కాళీపట్నం, పాతపాడు వసతి గృహాలు, ఎస్టీ వెల్ఫేర్‌కు సంబంధించి భీమవరం వసతి గృహం మరమ్మతులను అత్యవసరంగా చేపట్టాల్సి ఉందని సంబంధిత శాఖల అధికారులు కలెక్టర్‌కు వివరించారు. కలెక్టర్ స్పందిస్తూ మరమ్మతులను ప్రాధాన్యత క్రమంలో చేపట్టాలన్నారు. జిల్లా రెవెన్యూ అధికారి జె.ఉదయ భాస్కరరావు, జిల్లా గృహనిర్మాణ శాఖ ఈఈ జి.పిచ్చయ్య, జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ అధికారి జీవీఆర్‌కే ఎస్ఎస్ గణపతిరావు, సాంఘిక సంక్షేమ శాఖ సూపరింటెండెంట్ ఎస్.సత్యనారాయణ, సోషల్ వెల్ఫేర్ హెచ్ డబ్ల్యుఓ భానుమణి, ట్రైబల్ వెల్ఫేర్ హెచ్. డబ్ల్యుఓ శ్రీనివాస్ పాల్గొన్నారు.

గుర్రపు డెక్క, తూడు తొలగించాలి



గునుపూడి, తాడేరు మురుగు కాలువలను పరిశీలిస్తున్న రైతు నాయకులు

భీమవరం ఎడ్యుకేషన్, జూలై 25 : గునుపూడి, తాడేరు మురుగు కాలువలోని గుర్రపుడెక్క, తూడును తక్షణమే తొలగించాలని పశ్చిమ గోదావరి జిల్లా రైతు కార్యాచరణ సమితి, ఆంధ్రప్రదేశ్ కౌలు రైతుల సంఘాలు నాయకులు డిమాండ్ చేశారు. జిల్లా రైతు కార్యాచరణ సమితి, ఆంధ్రప్రదేశ్ కౌలు రైతుల సంఘాల ఆధ్వర్యంలో గురువారం గునుపూడి, తాడేరు మురుగు కాలువపై తాడేరు వంతెన వద్ద రైతులతో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా రైతు కార్యాచరణ గౌరవాధ్యక్షుడు కలిదిండి గోపాలకృష్ణంరాజు, ఆంధ్రప్రదేశ్ కౌలు రైతులు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మామిడిశెట్టి రామాంజనేయులు మాట్లాడుతూ గునుపూడి డ్రైన్‌పై అధికారుల నిర్లక్ష్యం తగదన్నారు. పదిహేను రోజులుగా నారుమడులు నీటిలో ఉన్నా కాలువలో చెత్త తీయకుండా కలుపు మందు కొట్టి వదిలేయడం సరైంది కాదని విమర్శించారు. తక్షణమే చెత్త తీయించాలని డిమాండ్ చేశారు. రైతు కార్యాచరణ సమితి అధ్యక్షుడు పాతపాటి మురళీకృష్ణంరాజు, జనరల్ సెక్రటరీ తమ్మినీడి నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

కార్గిల్ విజయం సువర్ణాధ్యాయం



కార్గిల్ యుద్ధ సైనికులను సత్కరించిన ఎమ్మెల్యే అంజిబాబు

భీమవరం టౌన్, జూలై 25 : కార్గిల్ విజయం భారతదేశ చరిత్రలో సువర్ణ అధ్యాయమని ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) అన్నారు. కార్గిల్ విజయ దివాస్ కాగడాల ర్యాలీని భీమవరం ఎమ్మార్వో ఆఫీస్ వద్ద ఉన్న అమరవీరుల స్థూపం నుంచి బొంబే స్వీట్స్ వద్ద ఉన్న మహాత్మా గాంధీ విగ్రహం వరకు నిర్వహించారు. బీజేపీ జాతీయ పార్టీ ఆదేశాల మేరకు రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి పిలుపు మేరకు యువ మోర్చా ఆధ్వర్యంలో నిర్వహించిన కాగడాల ర్యాలీని ప్రారంభించిన ఎమ్మెల్యే మాట్లా డుతూ దాదాపు 60 రోజులపాటు జరిగిన యుద్ధంలో 527 మంది భారత సైనికులు అమరులయ్యారన్నారు. భారత భూ భాగంలోకి ప్రవేశించిన పాకిస్తాన్ సైన్యాన్ని తరిమి కొట్టారన్నారు. ముందుగా తొమ్మిది మంది కార్గిల్ సైనికులు సీహెచ్ నాగరాజు, పీవీ సత్యనారాయణ, ఎస్.శ్రీనివాస్ పి.వేణు ప్రసాద్, బి.భూలోకం, జి.రాంపండు, అబ్రహం రాజు, వి.ప్రభాకర్, ఎం.శ్యామ్‌బాబులను సత్కరించారు. అనంతరం అమర వీరులకు జోహార్లు తెలుపుతూ నివాళులర్పించారు. బీజేపీ రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ చైర్మన్ పి.సత్యనారాయణ, బీజేవైఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఆరసవల్లి మణికంఠ, బీజేపీ జిల్లా కార్యదర్శి పి.సుభాష్, అసెంబ్లీ కన్వీనర్ కె.సురేంద్ర, కార్యదర్శులు ఎ.లీలకృష్ణ, ఎ.సుబ్రమణ్యం, యు.కపర్ధి, జనసేన నాయకులు వి.రామకృష్ణ, ఏఎంసీ మాజీ చైర్మన్ కె.నాగేశ్వరరావు, ఏబీవీపీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

వరద బాధితులకు అన్నదానం



నందమూరులో అన్నదానం చేస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం రూరల్, జూలై 25 : వరద బాధితులకు కూటమి ప్రభుత్వం అండగా ఉంటుందని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి వలవల బాబ్జి అన్నారు. ఎర్ర కాలువ వరద బాధితులకు పెదతాడేపల్లి టీడీపీ సీనియర్ నాయకుడు పసుమర్తి చందు సహకారంతో గురువారం నందమూరులో 500 మందికి, ఆరుళ్లలో 400 మందికి అన్నదానం చేశారు. నందమూరు సర్పంచ్ ఎస్.వరలక్ష్మి రాంబాబు పి.చందు, వి.బాబ్జి, పెదతాడేపల్లి సర్పంచ్ పి.అన్నవరంను సత్కరించారు. టీడీపీ నాయకులు ఎస్.శ్రీనివాస్, సి.చిట్టిబాబు, బి.శ్రీను, మాజీ సర్పంచ్‌లు వి.సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

● తణుకు : దువ్వ-వయ్యేరు కాలువ ముంపునకు గురైన ప్రాంతాల్లో తణుకు పీస్ ఆఫ్ యూత్ సోషల్ వెల్ఫేర్ సొసైటీ వ్యవస్థాపక అధ్యక్షుడు లాజర్ అబ్బదాసరి యువసేన అన్నదానం చేశారు. సభ్యులు బొంతు ఆర్కే, అబ్బదాసరి సొలేమాన్, కల్యాణ్, టి. సుధాకర్, యార్లగడ్డ దాస పాల్గొన్నారు.

● భీమవరం టౌన్ : పట్టణంలోని 2వ వార్డు మెంటే వారి తోటలోని 350 మంది ముంపు బాధితులకు శ్రీవిజ్ఞాన వేదిక కూటమి ఆధ్వర్యంలో ఆహార పొట్లాలు అందించారు. ప్రముఖ పారిశ్రామిక వేత్త గాదిరాజు సుబ్బరాజు, నిర్వాహకులు చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ ఎస్ కేటీసీ అధినేత గాదిరాజు సుబ్బరాజు ఆహార పొట్లాలను అందించామన్నారు. మాజీ కౌన్సిలర్లు ఎ.ఏసుపాదం, ఎం.గోపి, తదితరులు పాల్గొన్నారు.

10 కేజీల గడ్డి మోసి చేప



పెనుగొండ, జూలై 25 : సిద్దాంతం డైలీ మార్కెట్‌లోకి గురువారం సుమారు 10 కేజీల గడ్డి మోసి చేప అమ్మకానికి రావడంతో చేప ప్రియులు ఎగబడి మరీ కొనుగోలు చేశారు. నడిపూడి ప్రాంతంలో గోదావరి ఒడ్డున వలవేసి చేపలు పడుతుండగా ఈ చేత దొరికిందని ఇది అమ్మగా రూ.మూడు వేల 500 ధర పలికిందని మత్స్యకారుడు తెలిపాడు.

విద్యతో మంచి లక్షణాలు అలవడతాయి



పాలకోడేరులో విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న పార్వతి

పాలకోడేరు, జూలై 25 : చదువుతో విద్యార్థులకు మంచి లక్షణాలు ఏర్పడ తాయని అంగన్‌వాడీ సూపర్ వైజర్ పార్వతి అన్నారు. విస్సాకోడేరు జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థులకు వంద రోజులు కార్యక్రమంలో భాగంగా మిషన్ శక్తిపై అవగాహన కల్పించారు. అంగన్ వాడీలు పాల్గొన్నారు.

● పెనుగొండ : ఐసీడీఎస్ ఆధ్వర్యంలో గురువారం మిషన్‌శక్తి వంద రోజులు కార్యక్రమాన్ని స్థానిక వైఎస్ఎస్ కాలనీలో చెరుకువాడ జెడ్‌పీహెచ్ స్కూలులో, పంచాయతీ కార్యాలయం ఆధార్ మొబైల్ కేంద్రం నిర్వహించారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. సర్పంచ్ నక్కా శ్యామలా సోని శాస్త్రి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎం.విజయ కుమారి, హెచ్‌ఎం అంగన్ వాడీలు, ఆశాలు, ఏఎన్‌ఎం, ఎంఎల్‌పీహెచ్‌లు పాల్గొన్నారు.

● ఆచంట : కొడమంచిలి హైస్కూల్లో వంద రోజుల మిషన్‌శక్తి కార్యక్రమం అంగన్‌వాడీ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు మానవహారం నిర్వహించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కుమారి, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీలు, విద్యార్థులు పాల్గొన్నారు.

బడ్జెట్‌లో ఏపీకి అన్యాయం

నరసాపురం టౌన్ జూలై 25: కేంద్ర బడ్జెట్‌లో ఏపీకి తీవ్ర అన్యాయం జరిగిందని సీపీఎం పట్టణ కార్యదర్శి ఎం.త్రిమూర్తులు అన్నారు. బడ్జెట్ కేటాయింపులను నిరసిస్తూ గురువారం అంబేడ్కర్ సెంటర్‌లో నిరసన తెలిపారు. ప్రపంచ బ్యాంకు ఏజెన్సీల ద్వారా రుణాలు ఇప్పిస్తామని చెప్పడం సిగ్గు చేటన్నారు. అప్పుల్లో ఉన్న రాష్ట్రాన్ని మరింత అప్పుల్లోకి దింపే ప్రయత్నం కేంద్రం చేసిందన్నారు. పి.రాము, పి.నారాయణరావు, కొండ, శ్రీరాం, నాగేశ్వరరావు, చిన్ని, రాము, మల్లేష్‌లు పాల్గొన్నారు.

అంకెల గారడి బడ్జెట్

భీమవరం అర్బన్, జూలై 24: కేంద్ర బడ్జెట్ అంకెల గారడి తప్ప కార్మికుల సంక్షేమం కోసం తీసుకున్న చర్యలు ఏమి లేవని సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీహెచ్ నరసింగరావు అన్నారు. ప్యాడి అండ్ రైస్ మర్చంట్ హాలులో గురువారం విలేకరుల సమావేశం నిర్వహించారు. విశాఖ ఉక్కును అమ్మబోమని ప్రకటించడం గాని, పరిశ్రమ అభివృద్ధికి నిధులు కేటాయింపుకాని చేయలేదన్నారు. జిల్లా ఉపాధ్యక్షులు జెన్వీ గోపాలన్, బి.వాసుదేవరావు తదితరులు పాల్గొనారు..

వికసిత భారత్ బడ్జెట్

పాలకొల్లు రూరల్, జూలై 25 : పేదలు, రైతులు, యువత, మహిళల అభ్యున్నతి వికసిత భారత్ లక్ష్యంగా కేంద్ర బడ్జెట్ ఉందని బీజేపీ మహిళా మోర్చ జిల్లా అధ్యక్షురాలు అల్లూరి పద్మవర్మ అన్నారు. పట్టణంలోని పద్మ నివాసంలో గురువారం విలేకర్లతో మాట్లాడారు. కోటి మంది రైతులకు ప్రయోజనం చేకూర్చడం, ముద్ర రుణాలు పరిమితి రూ.20 లక్షలకు పెంచడం వంటివి ప్రవేశ పెట్టారన్నారు. ఏపీ రాజధాని నిర్మాణానికి రూ.15 వేల కోట్లు, పోలవరం ప్రాజెక్టు, ఆక్వా రంగ అభివృద్ధి, బంగారం ధరలు తగ్గించడం వంటివి ప్రధానమైనవన్నారు.

బాల్య వివాహాలు నియంత్రించాలి



నరసాపురంలో ర్యాలీ చేస్తున్న అంగన్‌వాడీలు

నరసాపురం టౌన్, జూలై 25: పట్టణంలోని కృష్ణబాబు కాలనీలో గురువారం ఐసీడీసీ ఆధ్వర్యంలో బేటి బచావో, బేటి పడావో కార్యక్రమం నిర్వహించారు. వార్డులో తిరుగుతూ బాల్య వివాహాలు అరికట్టాలని, లైంగిక దాడులు నియంత్రించాలంటూ ర్యాలీ సాగింది. అనంతరం సీడీపీవో ఊర్మిళ మాట్లాడుతూ రక్తహీనత వంటి సమస్యలుంటే వైద్య సిబ్బందికి తెలియజేయాలన్నారు. చిన్నతనం నుంచి పోషకాహారం అందిస్తే ఆడ పిల్లలు ఆరోగ్యవంతంగా ఉంటారన్నారు. చిట్టవరం హైస్కూల్‌లో న్యాయ విజ్ఞన సదస్సు నిర్వహించారు. చట్టాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. సూపర్‌వైజర్లు ఎన్.పద్మావతి, విజయకుమారి, న్యాయవాదులు శిరీష, ఆనందబాబు, హేమంత్, అంగన్‌వాడీ ఉమా పాల్గొన్నారు.

● అత్తిలి : బాల్య వివాహాలు వల్ల అనేక అనర్థాలు జరుగుతాయని మహిళా సంరక్షణాధికారి లక్ష్మి అన్నారు. ఆరవల్లి అంగన్‌వాడీ కేంద్రాల ఆధ్వర్యంలో బేటీ బచావో బేటీ పడావోలో భాగంగా గురువారం కిశోర బాలికలకు అవగాహన కల్పించారు. ఏఎన్‌ఎం విజయలక్ష్మి, అంగన్‌వాడీ కార్యకర్తలు ఉండ్రాజవరపు రాణి, వీఎల్ఎన్ కుమారి, సంది విజయ, సుగుణ, ఆశా వర్కర్లు ధనలక్ష్మి, రేణుక తదితరులు పాల్గొన్నారు

మావుళ్ళమ్మకు ఆషాఢం సారె



మావుళ్ళమ్మకు ఆషాఢ సారె సమర్పిస్తున్న మహిళలు

భీమవరం టౌన్, జూలై 25 : భీమవరం బ్లోసమ్స్, ఇన్నర్‌వీల్ క్లబ్ ప్రెసిడెంట్ శ్రీకరీ, సెక్రటరీ బి.ప్రత్యూషతో పాటు 25 మంది మహిళలు మావుళ్ళమ్మకు ఆషాఢం సారె సమర్పించారు.

● ఆకివీడు : ఆర్య వైశ్యులు వాసవీ మాతకు ఆషాఢ సారె సమర్పించారు. వాసవీ మాతను పల్లకీలో గ్రామోత్సవం నిర్వహించారు. వాసవీ కన్యకా పరమేశ్వరీ అమ్మవారు శాఖంబరి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు.

● తాడేపల్లిగూడెం రూరల్ : తాడేపల్లిగూడెంలోని వాసవీ మాతకు ఆర్య వైశ్య సంఘ గౌరవాధ్యక్షుడు మారం వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో సంఘ రాష్ట్ర నాయకుడు గమిని సుబ్బారావు నివాసం నుంచి ఆషాఢ సారెను సమర్పించారు.

బండి ముత్యాలమ్మ హుండీ ఆదాయం రూ. ఆరు లక్షలు

మొగల్తూరు, జూలై 25 :ముత్యాలపల్లి గ్రామ దేవత శ్రీ మ్మవారి హుండీని గురువారం లెక్కించారు. సుమారు 36 రోజులకు రూ. ఆరు లక్షల 91 వేల 761లు ఆదాయం లభించినట్టు ఈవో డి.రామకృష్ణంరాజు తెలిపారు. దేవాదాయ ధర్మాదాయ శాఖ అధికారులు, పాలకవర్గ చైర్మన్ కడలి మాణిక్యాలరావు, పాలకవర్గ సభ్యులు, గ్రామస్థులు, భక్తులు పాల్గొన్నారు.

నిత్యాన్నదానానికి రూ.55 వేల విరాళం

భీమవరం టౌన్, జూలై 25 : మావుళ్ళమ్మవారి శాశ్వత నిత్యాన్నదాన పథకానికి ఆకివీడుకి చెందిన తేజ ధరణి దంపతులు వారి కుమారుడు (మురారి విశాల్) పేరు మీద రూ.55 వేలు విరాళంగా అందజేశారు.

సాయినాథుడి ఊరేగింపు

పెంటపాడు, జూలై 25: గురుపౌర్ణమి ఉత్సవాల్లో భాగంగా పెంటపాడు ఊరచెరువు వద్ద గల షిరిడీ సాయినాయినాథుడి ఊరేగింపు ఘనంగా జరిగింది. ఆలయ కమిటీ అధ్యక్షుడు కె.లక్ష్మణరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని ఆందోళన

ఆకివీడు, జూలై 25 : తాళ్ళకోడులో జగనన్న కాలనీ సమస్యలు పరిష్కరించాలని గురువారం నగర పంచాయతీ మేనేజర్ వెంకటేశ్వరరావుకు పట్టణ పౌరుల సంఘం నాయకులు, కాలనీ వాసులు వినతిపత్రం అందచేసి మాట్లాడారు. తమ సమస్యలు పరిష్కరించే వరకూ ఆందోళనలు, ధర్నాలు చేస్తూ ఉంటామని హెచ్చరించారు. బీవీ వర్మ, డోకల రవితేజ, బొడ్డుపల్లి రాంబాబు, సందక సూరిబాబు, గేదెల ధనుష్, పిసిని వరలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శి మృతి

ఇరగవరం, జూలై 25 : దీర్ఘకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఓగిడి, కాకిలేరు పంచాయతీ కార్యదర్శి టీవీవీ ప్రసాద్ (55) ఏలూరు ఆశ్రం ఆస్పత్రిలో చికిత్స పొందుతూ గురువారం మృతి చెందారు. ఆయన మృత దేహానికి మండల పంచాయతీ కార్యదర్శులు, మండల పరిషత్ కార్యాలయ సిబ్బంది పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయనకు భార్య, కుమార్తె ఉన్నారు.

200 మందికి ఆధార్ నమోదు

నరసాపురం రూరల్, జూలై 25: మండలంలోని ఐదు సచివాలయాల్లో గురువారానికి 200 మందికి ఆధార్ సీడింగ్ చేసినట్లు ఇన్‌చార్జి ఎంపీడీవో వీరభద్రరావు తెలిపారు. ఆధార్‌లో ఏమైనా తప్పులుంటే సవరించుకోవాలన్నారు.

విద్యార్థులకు ఉచిత బస్ పాస్‌ల పంపిణీ

గణపవరం, జూలై 25: పిప్పర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు గురువారం ఉచిత బస్‌పాస్‌లు పంపిణీ చేశారు. ముప్పర్తిపాడు గ్రామానికి చెందిన కొవ్వూరి చినరామిరెడ్డి తన భార్య నాగసత్యవతి జ్ఞాపకార్థం 200 మంది విద్యార్థులకు ఉచిత బస్‌పాస్‌లు తాడేపల్లిగూడెం డిపో మేనేజర్ వైఎస్ఎన్ మూర్తి చేతుల మీదుగా పంపిణీ చేశారు. పుర ప్రముఖులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సమాచారం

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

నరసాపురం రూరల్, జూలై 25: మండలంలోని సీతారాంపురం విద్యుత్ సబ్ స్టేషన్‌లో నిర్వహణ పనులు చేపడుతున్నందున్న శుక్రవారం ఉదయం ఏడు నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు సీతారాంపురం, రాజుగారితోట, పసలదీవి, ఎల్‌బీ చర్ల, చామకూరిపాలెం, మోడీ, మొగల్తూరు మండలంలోని రామన్నపాలెం, జెట్టిపాలెం గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఈఈ సురేష్‌కుమార్ చెప్పారు.

● గణపవరం : సరిపల్లె విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని సరిపల్లె, గణపవరం, చినరామచంద్రాపురం, క్రొవ్విడి, గ్రామాల్లో శుక్రవారం ఉదయం ఎనిమిది నుంచి 11 గంటల వరక విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నామని తాడేపల్లిగూడెం ఈఈ వెంకటేశ్వరరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.

● తాడేపల్లిగూడెం రూరల్, జూలై 25: కుంచనపల్లి, మోదుగగుంట, టిడ్కో సబ్ స్టేషన్‌ల పరిధిలోని మోదుగగుంట, గొల్లగూడెం, అప్పారావుపేట, వెంకట్రావుపాలెం, టిడ్కో ఇళ్ల సముదాయాలు, కొండ్రుప్రోలు, కేఎస్‌ఎన్ కాలనీ ప్రాంతాలలో శుక్రవారం ఉదయం ఎనిమిది నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు ఈఈ ఎస్. వెంకటేశ్వరరావు తెలిపారు.

30న కౌన్సిల్ సమావేశం

నరసాపురం టౌన్, జూలై 25: మునిసిపల్ కౌన్సిల్ సమావేశాన్ని కార్యాలయంలో ఈ నెల 30న నిర్వహిస్తున్నట్లు కమిషనర్ వెంకటేశ్వరావు తెలిపారు.